3CTR 2:3CTR 2.qxd 7/2/2026 11:22 PM Page 1



# కుప్పం చరిత్ర.. ప్రజల తలరాత మార్చుతున్న సిఎం చంద్రబాబు !!

- 7939కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.. స్వర్ణకుప్పం సాధనే లక్ష్యంగా చర్యలు !!
- ఇప్పటికే వేలకోట్లతో భారీ పరిశ్రమలు.. యువతకు ఉపాధి అవకాశాలు!!
- రైతన్నలకు కృష్ణాజలాలు.. ప్రజలకు అభివృద్ధి..సంక్షేమ ఫలాలు !!
- అభివృద్ధి అంటే 2024కు ముందు ఆ తర్వాత అనేలా చొరవ !!



కుప్పం, జూలై 2 ప్రభాతవార్త

37 సంవత్సరాలుగా తనను వరుసగా గెలిపిస్తూ వస్తున్న కుప్పం ప్రజల రుణం తీర్చుకునేలా,కుప్పం ప్రజల తలరాతలను సిఎం చంద్రబాబునాయుడు మార్చుతున్నారు. కుప్పాన్ని స్వర్ణకుప్పం చేయాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టి సక్సెస్ అవుతున్నారు. ఈనెల 3-5తేదీల్లో కుప్పంలో పర్యటించనున్న సిఎం చంద్రబాబు ఈ దఫా ఏకంగా 7939కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నారు. కుప్పంలో అభివృద్ధి అంటే 2024కు ముందు ఆ తర్వాత అనే రీతిలో అభివృద్ధి బాటలు వేస్తూ కుప్పం చరిత్రను తిరగరాస్తున్నారు. ఇప్పటికే కుప ్పంలో వేలకోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. తాజాగా ఈ పర్యటనలో సిఎం చంద్రబాబు దేశంలోనే తొలిబ్యాటరీ అనోడ్ మెటీరియల్ తయారీ కేంద్రంను అతా కంపెనీ ద్వారా 2081కోట్ల పెట్టుబడులతో శంకుస్థాపన చేస్తారు. అలాగే ప్రఖ్యాత షూ కంపెనీ అయిన అడిడాస్ మాన్యుఫాక్చర్ యూనిట్‌కు 900కోట్లతో శంకుస్థాపన చేయనున్నారు. అలాగే ఎయిర్ క్రాఫ్ట్‌ల తయారీ యూనిట్ పయనీర్ క్లీన్ యాంప్స్‌కు శంకుస్థాపన చేస్తారు. వీటితో పాటు ఇతర పరిశ్రమలు, ఎంఎస్ఎంఇ పార్కులను ప్రారంభించనున్నారు. కుప్పంలో సుమారు 120కోట్లతో అత్యాధునిక బస్‌స్టేషన్, బస్టాండ్ నిర్మాణంకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే 65ఏళ్లుగా భూ పట్టాలు లేని రైతులకు భూపట్టాలు పంపిణీ చేస్తారు.

ఇండస్ట్రియల్ హబ్‌గా కుప్పం : సిఎం చంద్రబాబునాయుడు కుప్పాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చుతున్నారు. గుడుపల్లె మండలం పొగురుపల్లి, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో పారిశ్రామికవాడలు ఏర్పాటుచేయిస్తున్నారు. ఇక్కడ ఇప ్పటికే సుమారు 28 కంపెనీలు వచ్చాయి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలతో పాటు వివిధ రకాల పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. తద్వారా ఈ ప్రాంతంలోని యువతకు, మహిళలకు ఉపాధి, రైతుల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. సిఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో కుప్పానికి పెట్టుబడుల వరద కొనసాగుతోంది. ఇక గతేడాదే సిఎం చంద్రబాబు కుప్పానికి కృష్ణాజలాలు తీసుకువచ్చారు. 150చెరువులను నింపారు. మిగతా చెరువులను కూడా నింపాలని అధికారులను ఆదేశించారు. కృష్ణాజలాల రాకతో కుప్పం ప్రాంతంలో వ్యవసాయం మరింత పెరుగుతోంది. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన రెండేళ్లలో గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు సైతం సిఎం చంద్రబాబు చర్యలు చేపట్టారు. అవసరం ఉన్న గ్రామాలకు రోడ్లు, తాగునీటి వసతి, వీధి దీపాలు, డ్రైనేజీలు నిర్మింపజేశారు. ఇక ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టారు. గేర్ మార్చుతున్న సిఎం చంద్రబాబు : తన సొంత నియోజకవర్గం కుప్పంలో సిఎం చంద్రబాబు గేర్ మార్చారు. పార్టీ వ్యవహారాలు స్వయంగా పర్యవేక్షిస్తున్న సిఎం తన పర్యటనలో భాగంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో సైతం సమావేశాలు నిర్వహించనున్నారు. స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులకు సమాయత్తం చేయడంతో పాటు పార్టీ బలోపేతంకు దిశానిర్దేశం చేయనున్నారని తెలిసింది. మరో పక్క అధికార యంత్రాంగంతో సైతం సిఎం చంద్రబాబు సమావేశం జరుపుతారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించి అధికారులకు అభివృద్ధి, ప్రజల సంక్షేమాలపై తగు ఆదేశాలు జారీ చేయనున్నారు. ఏది ఏమైనా ఈ సారి సిఎం చంద్రబాబు కుప్పం పర్యటనలో ప్రజలు, పార్టీ శ్రేణులు, అధికార యంత్రాంగంను కలవడంతో పాటు కుప్పం అభివృద్ధిని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లేలా సిఎం చర్యలు చేపట్టడం విశేషం.

## ఉపాధి హామీ పథకాన్ని మార్చొద్దు

-కాంగ్రెస్, కమ్యూనిస్టులు నిరసన...

రైల్వేకోడూరు రూరల్, జులై 2 ప్రభాతవార్త



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వి బి జి రామ్ పథకంగా మార్చడం దారుణమైన విషయమని రైల్వేకోడూరుకు చెందిన కాంగ్రెస్, సిపిఐ బృందాలు గాంధీ బొమ్మ వద్ద నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ ని మరిచి బిజెపి వారి పేరును ప్రస్తావించడం సరికాదని వారు ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఒక పథకం ప్రకారమే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చడంలో ఆంతర్యం ఏమిటని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినప్పటికీ పథకంలో పేర్లు మార్చడంలో న్యాయం కాదని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి ఉపాధి హామీ పథకాన్ని అలాగే ఉంచాలని వారు డిమాండ్ లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి చిన్నయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోశాల దేవి, డాక్టర్ సయ్యద్ అహ్మద్, ఉప్పుటూరు ఆనంద్, రాజశేఖర్, జయరాం, డిహెచ్పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు వీడ్కోలు పలికిన పంతగాని...



రైల్వేకోడూరు రూరల్, జులై 2 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైల్వేకోడూరు నియోజకవర్గం ముక్కువారిపల్లిలో విబిజిరాంజీ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంలో హెలిప్యాడ్ ప్రాంతం వద్ద రైల్వేకోడూరు టిడిపి యువ నాయకులు రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహా ప్రసాద్ చంద్రబాబుకు వీడ్కోలు పలికినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ ఎలా ఉన్నారు అని భుజం తట్టి పలకరించినట్లు పంతగాని తెలిపారు.

## వీబీజీ రామ్‌జీ పథకం సద్వినియోగం

పెనుమూరు, జులై 2 ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుకు శ్రీకారం చుట్టిన వీబీజీ రామ్‌జీ పథకంను నిరుపేద ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని మండల తెలు గుదేశం పార్టీ అధ్యక్షులు పెద్దినేని రుద్రయ్య నాయుడు పేర్కొన్నారు. మండల పరిధిలోని రామకృష్ణాపురంలో గురువారం వీబీజీ రామ్‌జీ పనులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెద్దినేని రుద్రయ్యనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో పనిదినాలను ప్రస్తుతం వున్న 100 రోజుల నుండి 125 రోజులకు పెంచడం జరిగిందన్నారు. అలాగే దినసరి కూలీలకు వేతనం రూ.312 చేశారని, వ్యవసాయ పనుల సమయంలో ఉపాధి పనులకు పూర్తి స్థాయిలో సెలవు ప్రకటించడం జరుగుతుందన్నారు. అలాగే పని చేసిన కూలీలకు పదిహేను రోజుల్లో చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో కలిసి రుద్రయ్య నాయుడు కొబ్బరి చెట్ల పెంపకం పనుల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఎపిఓ గుణశేఖర్, ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ ఢిల్లీబాబు, స్థానిక దేశం నాయకులు తలారి రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణ మాసోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

చిత్తూరుహెల్త్, జులై 2 ప్రభాతవార్త:



డెంగ్యూను కట్టడి చేయడానికి పక్కా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ నరసిం హప్రసాద్ అన్నారు. డెంగ్యూ జ్వరాలను కట్టడి చేయడానికి ముందస్తు చర్యల్లో భాగంగా మున్సి పల్ కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో కమీషనర్ నరసింహప్రసాద్ గురువారం డెంగ్యూ నివారణ మాసోత్స వాల గోడపత్రికను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా కమీషనర్ నరసింహప్రసాద్ మాట్లాడుతూ డెంగ్యూ నివారణ మాసోత్స వాల్లో భాగంగా అన్ని ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి వారికి అవగా హన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకుని ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే దోమలను కట్టడి చేయడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాలపై ప్రజల్లో అవగాహన పెంచి ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎసిపి నాగేంద్ర, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయానికి భరోసా.. చేనేతకు చేయూత

### - మంత్రి నారా లోకేష్‌ని కలిసి రాట్నం(చరఖా)

### జ్ఞాపికను అందజేసిన గుత్తి త్యాగరాజు

- శ్రీ సిటీలో లోకేష్‌తో భేటీ కొత్త ఆశలకు నాంది

వరదయ్యపాలెం, జూలై 2, ప్రభాతవార్త



రాష్ట్ర అభివృద్ధి అంటే కేవలం పరిశ్రమలు, ఐటీ సంస్థలు, పెట్టుబడులు మాత్రమే కాదు. వేల ఏళ్ల చరిత్ర కలిగిన సంప్రదాయ వృత్తులు, వాటిపై ఆధారపడిన కుటుంబాలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే ఆ అభివృద్ధికి సంపూర్ణత చేకూరుతుంది. శ్రీ సిటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఆర్టీజీఎస్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో జరిగిన భేటీలో జాతీయ చేనేత నాయకుడు, దేవాంగ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షులు, డీవీఎంసీ సభ్యులు గుత్తి త్యాగరాజు సందేశం బలంగా వినిపించింది. శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం సందర్భంగా హెలిప్యాడ్ వద్ద మంత్రి నారా లోకేష్‌కి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి, భారతీయ స్వావలంబనకు, చేనేత సంప్రదాయానికి చిరస్మరణీయమైన ప్రతీక అయిన చరఖా (రాట్నం) జ్ఞాపికను అందజేయడం ఎంతో ప్రతీకాత్మకంగా నిలిచింది. ఇది ఒక బహుమతి మాత్రమే కాదు; రాష్ట్ర చేనేత కార్మికుల ఆశలు, ఆత్మగౌరవం, ఆవేదనలను ప్రభుత్వానికి చేరవేసిన సందేశం. చేనేత సమాజానికి రాజకీయంగా గుర్తింపు లభించడం కూడా అంతే ముఖ్యమైన విషయం. మంగళగిరికి చెందిన ప్రముఖ చేనేత నాయకుడు గుత్తి కొండ ధనుంజయరావుకి టీడీపీ పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించినందుకు మంత్రి లోకేష్‌కి కృతజ్ఞతలు తెలియజేయడం ద్వారా, చేనేత వర్గానికి నిర్ణయాత్మక స్థాయిలో ప్రాతినిధ్యం అవసరమనే భావన మరోసారి వ్యక్తమైంది. గత కొంతకాలంగా నారా లోకేష్ చేనేత వస్త్రాలను రాష్ట్రపతి, జాతీయ నాయకులు, విదేశీ ప్రతినిధులు, పలువురు ప్రముఖులకు అందజేస్తూ ఆంధ్రప్రదేశ్ చేనేతకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్నారు. చేనేతను ఒక జీవన విధానంగా, రాష్ట్ర గౌరవంగా ప్రపంచానికి పరిచయం చేస్తున్న ఈ ప్రయత్నాలు ప్రశంసనీయమైనవి. సంప్రదాయాన్ని ఆధునికతతో అనుసంధానించే నాయకత్వం చేనేత రంగానికి కొత్త మార్కెట్లను, కొత్త అవకాశాలను తెరవగలదు. అయితే గుర్తింపు మాత్రమే సరిపోదు. వ్యవస్థాగత బలోపేతం కూడా అవసరం. అందుకే దేవాంగ కార్పొరేషన్, తొగట కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆయా వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని గుత్తి త్యాగరాజు విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ కేవలం ఒక వర్గం కోసమే కాదు; సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా ఎంతో అవసరమైన చర్య. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాల సంక్షేమంపై ప్రభుత్వం మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరడం సమాజంలోని అన్ని వర్గాల సమగ్రాభివృద్ధిపై ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి చేరినప్పుడే ప్రజాస్వామ్యం తన అసలు లక్ష్యాన్ని చేరుకుంటుంది. మంత్రి నారా లోకేష్ అన్ని అంశాలను ఓపికగా విని, చేనేత నాయకుడు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గుత్తి కొండ ధనుంజయరావుతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా ముందుకు సాగాలని, ప్రభుత్వం చేనేత వర్గంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇవ్వడం విశ్వాసాన్ని పెంచింది. చేనేత, చేతివృత్తులు, గ్రామీణ కళాకారులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పరిశ్రమల అభివృద్ధి ఎంత అవసరమో, చేనేత మగ్గం శబ్దం కొనసాగడం కూడా అంతే అవసరం. చేనేత బతికితేనే మన సంస్కృతి బతుకుతుంది. మగ్గం తిరిగితేనే వేలాది కుటుంబాల్లో వెలుగు నిండుతుంది. సంప్రదాయ వృత్తులకు ప్రభుత్వ ప్రోత్సాహం, సమాజం ఆదరణ, నాయకత్వం అండగా నిలిస్తే ఆంధ్రప్రదేశ్ చేనేత ప్రపంచ మార్కెట్‌లో మరింత ఉన్నత స్థానాన్ని సంపాదించడం ఖాయం. శ్రీ సిటీలో జరిగిన ఈ భేటీ ఒక మర్యాదపూర్వక సమావేశం మాత్రమే కాదు; చేనేతకు కొత్త దిశ, దేవాంగ సమాజానికి కొత్త ఆశ, సామాజిక న్యాయానికి కొత్త భరోసా, సమగ్ర అభివృద్ధికి కొత్త సంకల్పంగా చరిత్రలో నిలిచే అవకాశం ఉంది. ఇప్పుడు ఆ సంకల్పం కార్యరూపం దాల్చాలని చేనేత సమాజం ఆశిస్తోంది.

## నేటి నుండి దిగువమాఘంలో మహాభారత యజ్ఞం

తవణంపల్లి, జులై 2 ప్రభాతవార్త:

మండలంలోని దిగువమాఘం గ్రామం బహుదా నది ఒడ్డున వెలసిన శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల వారి దేవస్థానంలో మహాభారత యజ్ఞం శుక్రవారం నుండి ప్రారంభం అవుతుందని ఆలయ ధర్మకర్త ఆర్.ఉమాపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం గరిగోత్సవం, అఖిలాండ ప్రదానం, ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే మహాభారత యజ్ఞం ఈ నెల 27వ తేదీన జరిగే ధర్మరాజుల పట్టాభిషేకంతో ఘనంగా ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రతి రోజు పగలు సి.గీతావాణి భగవతారిణిచే హరికథలు, క్రిష్ణగిరి ఆసిరియర్ పరమశివన్, తిరపత్తూరు తమిళ అరసు శ్రీ విష్ణుగోకుల కన్నన్ నాటక సభై వారిచే రాత్రి వీధి నాటకంలు ప్రదర్శించబడుతుందని ధర్మకర్త ఉమాపతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మహాభారత యజ్ఞంను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఎన్యుమరేటర్ ఫారాలు సకాలంలో అందించాలి

బైరెడ్డిపల్లి, జూలై 2 ప్రభాతవార్త

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఎన్యుమరేషన్ ఫారాలను భర్తీ చేసి సకాలంలో బిఎల్ఓలకు అందించాలని తహశీల్దార్ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. ఫారాల భర్తీ విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా బిఎల్ఓలను సంప్రదించి వారి ద్వారా కూడా ఫారాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రజలు కూడా సరైన వివరాలతో ఎన్యుమరేషన్ ఫారాలను భర్తీ చేయాలని పేర్కొన్నారు. బిఎల్ఓలు కూడా ఎప్పటికప్పుడు ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయాలన్నారు.

## నేడు కాణిపాకంలో సంకట హర చతుర్థి వ్రతం

కాణిపాకం, జులై 2 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం సంకటహర చతుర్థి వ్రతంను నిర్వహించనున్నట్లు ఆలయ ఇఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 9, 11, సాయంత్రం 3, 5 గంటలకు నాలుగు దఫాలుగా ఈ వ్రతంను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనే భక్తులు రూ.500 టిక్కెట్‌తో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## కొత్తకోట వద్ద రోడ్డుపై లారీల నిలుపుదలపై స్థానికుల ఆగ్రహం




పూతలపట్టు, జూలై 2, ప్రభాతవార్త

బెంగళూరు - నాయుడుపేట జాతీయ రహదారి పై రోడ్డు పక్కన వాహనాలు నిలపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని పత్రికలలో వెలువడినప్పటికీ ఎన్ హెచ్ ఐ అధికారులు, సిబ్బంది రోడ్డు పక్కన నిలిపిన వాహనాలను తీపించకపోవడంతో రహదారిపై అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు, స్థానిక ప్రజలు వాపోతున్నారు అయితే పి కొత్తకోట సమీపంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై లారీ నిలిపివేయడంతో కొన్ని నెలల క్రితం లారీని కారు డీకొని ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. గుంత గాదింకి సమీపంలో ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొని నలుగురు మృతి చెందిన ఘటన తెలిసిందే. అయితే ఎన్‌హెచ్ఐ సిబ్బంది నిర్లక్ష్యపు విధులు వాళ్ళనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సిబ్బందికి పలుమార్లు తెలిపిన ఏ మాత్రం స్పందించని ప్రయాణికులు చెపుతున్నారు. అయితే నింద్రగుంట నుండి రంగంపేట క్రాస్ రహదారిపై మళ్లీ లారీలను రోడ్డుపైనే నిలుపుతున్నారని లారీలు రోడ్డుపై నిలపడంతో ప్రమాదాలు జరగవా అని స్థానికులు అధికారులపై మండిపడుతున్నారు. ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న తర్వాత కూడా హైవే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తు ఎన్ హెచ్ ఐ అధికారులు సిబ్బంది సమగ్రతతో విధులు నిర్వర్తిస్తూ రోడ్డుపై రోడ్డుపై నిలిపిన వాహనాల యజమానులు, డ్రైవర్లని తగిన చర్యలు తీసుకొని వారికి ప్రమాదాలు జరుగుతాయని అవగాహన కల్పించాలని స్థానికులు చెబుతున్నారు. ఎన్ హెచ్ ఐ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## కంటైనర్ బోల్తా - తప్పిన ప్రమాదం

పలమనేరు. జూలై 2. (ప్రభాతవార్త)



పలమనేరు సమీపంలోని గంటవూరు వద్ద గురువారం సాయంత్రం ఓ కంటైనర్ కారును డీ కొన్న సంఘటనలో కంటైనర్ అదుపు తప్పి బోల్తా పడింది. తిరుపతి నుండి బెంగళూరు వెళుతున్న కారును ఓవర్ టేక్ చేయబోయి కంటైనర్ ప్రమాదానికి గురైంది. ఐతే ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. కంటైనర్ కారును కొంత దూరం లాక్కు పోయింది. కంటైనర్ డ్రైవర్ మద్యం సేవించినట్లు తెలుస్తోంది. పలమనేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కంగుందిలో పెద్ద ఎత్తున పారిశుద్ధ పనులు



కుప్పం ,జూలై 2 ప్రభాతవార్త

మండలంలోని కంగుంది గ్రామంలో ఈనెల నాలుగో తేదీ సీఎం చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో గురు వారం కుప్పం ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పారిశుద్ధ పనులను ప్రత్యేకంగా పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామంలోని రోడ్లు,వీధులు శుభ్రపరచడంతోపాటు సీఎం పాల్గొనే సభా ప్రాంగణం వద్ద పనులను చేయించారు.

## మానవత్వం చాటుకున్న మాజీ సర్పంచ్

### అనాధ శవానికి ఘనంగా అంతక్రియలు



కుప్పం ,జూలై 2 ప్రభాతవార్త

స్థానిక డికెపల్లి మాజీ సర్పంచ్ డివి సుబ్రహ్మణ్యం మరోమారు తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు .ఇటీవల కుప్పం చెన్నై రైలు మార్గంలో మల్లానూరు వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించి అతని ఆచూకీ కోసం సమాచారం అందించారు. అయితే మృతుడి బంధువులు, కుటుంబీకులు ఎవ రూ రాకపోవడంతో గురువారం రైల్వే పోలీసులు మాజీ సర్పంచ్ డీకేపల్లి మణిని ఆశ్రయించారు. దీంతో ఆయన దగ్గర ఉండి అనాధ శవానికి అంత్యక్రియలను నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి



రామకుప్పం, జూలై 2 ప్రభాతవార్త

మండలంలోని విజలాపురం ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో డెంగ్యూ వ్యాధి పై వైద్యాధి కారులు పూజిత, సాయి శ్రీ అవగాహన కల్పిం చారు. బుధవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్స వాలు విద్యార్థులచే ర్యాలీ చేపట్టారు. టైగర్ దోమ కాటు వలన వ్యాధి వ్యాప్తి చెందుతుందని ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సాయంత్రం వేపాకుతో పొగ దోమతెరలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఎంఎల్ హెచ్ పి పుష్ప, రాధా, ఏఎన్ఎం గ్లోరీ, ఆశ వర్కర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకునేలా వివరించండి

రామకుప్పం, జూలై 2 ప్రభాతవార్త



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వివరిం చాలని రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, చంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పంద్యాల మడుగు యూనిట్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక ఎన్నికలకు కూటమి అభ్యర్థుల గెలుపుకు ఇప్పటినుంచి సంసిద్ధం కావాలని కోరారు. గ్రామ గ్రామాన నేతలు కార్యకర్తలు పర్యటించి అభివృద్ధి సంక్షేమాలను ప్రజలు వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. త్వరలో హంద్రీనీవా నీటిని ప్రతి గ్రామానికి తీసుకొచ్చి చెరువులను అనుసంధానం చేసి పుష్కలంగా నీటిని సరఫరా చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట్లప్ప గౌడు, పంచాయతీ అధ్యక్షులు గజేంద్ర, శ్రీనివాసులు గౌడు, అపాలప్ప, నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంసెట్ 2026 ఫలితాల్లో విజయం విజయభేరి

చిత్తూరురూరల్, జూలై 2 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణంలోని విజయం జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంసెట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారని విద్యా సంస్థల అధినేత డా. ఎం.తేజోమూర్తి తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో పూర్ణచంద్ర 1728, సాయి పూజిత 2231, దీపక్ 2375, వేణి 3244, పవన్‌కుమార్ 2941, విష్ణుప్రియ 4934, ధావని 5687, భావన 7593, రాజశ్రీ 8660, మోహిత 9475, అఖిల్ 9632 ర్యాంకులు సాధించారన్నారు. అలాగే అగ్రికల్చరల్ విభాగంలో జ్యోషిత 6345, అయేషా 6597, ఎస్విత 6768, సుజిత 8354, రుషిత 9225లు సాధించారని పేర్కొన్నారు. ఈ ఫలితాలతో పాటు 288మంది విద్యార్థులు అర్హత సాధించారని అకాడమిక్ డైరెక్టర్ ఎం. శైలజమూర్తి తెలిపారు. కాగా విద్యార్థులను విద్యాసంస్థల అధినేత తేజోమూర్తితో పాటు అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి, అధ్యాపక బృందం అభినందించారు.

## వీబీజీ రామ్‌జీ పనులు ప్రారంభించిన ఎంపిడిఓ

గుడిపాల, జులై 2 ప్రభాతవార్త:



మండల పరిధిలోని నారగల్లు గ్రామ పంచాయతీలో గురువారం ఎంపిడిఓ గౌరీ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడులు వికసిత్ భారత్ -గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(వీబీ జీ రామ్ జీ) పథకం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి పనులను వంద రోజుల నుండి 125 రోజులు పెంచి ఉపాధి కల్పించాలని నిర్ణయించి కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు సకాలంలో బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లింపులు జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ పథకంను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని తమ గ్రామాల్లో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఎపిడి సుబ్రమణ్యంనాయుడు, డిప్యూటీ ఎంపిడిఓ కృష్ణప్రసాద్, కూటమి పార్టీల నాయకులు శింబు, గోపి, వికసిత్ భారత్ రామ్‌జీ సిబ్బంది, ఉపాధి కూలీలు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

3 -7Pg9th cheli:3 -7Pg9th cheli.qxd 7/2/2026 11:29 PM Page 1



## అవాంఛిత రోమాలు తొలగించాలంటే..



ఈ మధ్య అమ్మాయిల్లో పై పెదవి పైన, గడ్డం దగ్గర, సైడ్‌లాక్స్ దగ్గర అవాంఛిత రోమాలు రావడం ఎక్కువైంది. దీన్ని హిరుసటిజం అంటారు. ఇది ఉన్నవారిలో పురుషులకు ఎక్కడ వెంట్రుకలు వస్తాయో మహిళలకు కూడా అదే ప్రాంతంలో ఒత్తుగా వెంట్రుకలు వస్తుంటాయి. చాలామందిలో పిసిఓఎస్ కారణంగా ఈ సమస్య వస్తుంటుంది. ఇక మరికొంత మందికి ఎలాంటి హార్మోన్ల సమస్య లేకపోయినా పైపెదవి పైన, గడ్డం దగ్గర వెంట్రుకలు వస్తుంటాయి. ఇది వంశపారంపర్యంగా వస్తుంటుంది. దీనిని హైపర్‌ట్రైకోసిస్ అంటారు. హిర్సుటిజం సమస్య ఉన్నప్పుడు దానికి గల కారణాన్ని తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. ఏదైనా సమస్య ఉంటే మొదట అందుకు తగిన చికిత్స తీసుకుని ఆ తర్వాత వెంట్రుకల పెరుగుదలను ఆపడానికి ప్రయత్నించవచ్చు. ఒకవేళ అప్పటికే వెంట్రుకలు ఒత్తుగా పెరిగి ఉంటే వాటిని తొలగించడానికి పర్మనెంట్ హెయిర్ లేజర్ రిడక్షన్ ట్రీట్‌మెంట్ చేస్తుంటారు. అయితే లేజర్ ట్రీట్‌మెంట్‌లోనూ పలు రకాలుంటాయి. ఇందులో ట్రిపుల్ వేవ్‌లెంగ్త్ లేజర్‌ని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఇది వివిధ దశల్లో ఉన్న హెయిర్ ఫాలికల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. ఈ ట్రీట్‌మెంట్‌ని నెలకోసారి చేయించుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఆరు నుంచి ఎనిమిది సెషన్లలో అవాంఛిత రోమాల సమస్య తగ్గిపోతుంది. అయితే పిసిఓఎస్, హార్మోన్ల అసమతుల్యత ఉన్నవారికి ఎక్కువ సెషన్లు తీసుకోవాల్సి వస్తుంది. అవాంఛిత రోమాలకు గల అసలు సమస్యను తెలుసుకుంటే సెషన్ల సంఖ్యను తగ్గించుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి మీ సమస్యను గుర్తించి, ఆ తర్వాత సరైన సద్ధతిలో హెయిర్ లేజర్ చేయించుకుంటే మంచి ఫలితం ఉంటుంది. □

## బ్యూటీకి సూత్రాలు

ప్రతి వారు అందంగా కనిపించాలని తాపత్రయపడు తుంటారు. అందంగా వుండాలని కోరికవుంటే సరిపోదు అందనికి అవసరమైన ఆచరించదగిన సూత్రాలను ఖచ్చితంగా పాటించాలి. ★ అందంగా కనిపించాను కునేవారు నిద్రవిషయంలో అత్యంత జాగ్రత్త వహించాలి. పగలు ఎక్కువగా నిద్రించకూడదు. గృహిణులు అరగంట నిద్రపోతే అలసట పోయి ఫ్రెష్‌గా కనిపిస్తారు. ★. వయసునుబట్టి పేస్‌ప్యాక్ ఉపయోగించడం అలవాటు చేసుకోండి. తలారా స్నానం చేయడానికి ముందుగ అయిల్‌బాగా మసాజ్ చేసుకోవాలి. ❐

## పిల్లలు ఎత్తు పెరగడం లేదా ?



తమ పిల్లలు ఎత్తుగా ఉండాలి.. ఎత్తుకు తగ్గ బరువుండాలి. అని తల్లిదండ్రులు కోరుకోవడం సహజం. అయితే కొంతమంది చిన్నారుల్లో పెరుగుదల మందకొడిగా సాగడం, ఒక వయసొచ్చాక ఆగిపోవడం వల్ల సరైన ఎత్తు పెరగక పొట్టిగా కనిపిస్తుంటారు. తల్లిదండ్రుల జీన్స్ ఒక్కటే దీనికి కారణం అనుకుంటే పొరపాటే! ఎందుకంటే పోషకాహార లోపం, శరీరానికి సరైన వ్యాయామం లేకపోవడం, వారుండే వాతావరణం. వంటివీ చిన్నారుల ఎత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే పిల్లలు ఎత్తు పెరగడానికి కొన్ని వ్యాయామాలు దోహదం చేస్తాయంటున్నారు. మరి, ఏంటా వర్కవుట్లు? తెలుసుకుందాం..

**స్ట్రెచింగ్ వ్యాయామాలు ...** స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయడానికి సులభంగా ఉండడంతో పాటు, పిల్లలు ఎత్తు పెరగడానికి ఎంతో ప్రభావవంతంగా పని చేస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో నిటారుగా నిల్చొని కిందికి వంగుతూ కాలి వేళ్లను అందుకోవడం, కాళ్లు ముందుకు చాపి కూర్చొని చేతి వేళ్లతో కాళ్లను అందుకోవడం, శరీర పైభాగాన్ని ఇరువైపులా వంచుతూ చేసే వ్యాయామాలు.. ఇలాంట వర్కపుట్లు వెన్నెముకకు ఫ్లెక్సిబులిటీని అందిస్తాయి. అది సులభంగా సాగేలా చేస్తాయి. ఫలితంగా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగడం సులువవుతుంది.

**వేలాడితే మంచిదే!...** పిల్లల ఎత్తు పెరగడానికి చాలామంది నిపుణులు సూచించే వ్యాయామాలివి. బార్ హ్యాంగింగ్స్, హ్యాంగింగ్‌రాడ్, పులప్స్, చిన్‌-అప్స్.. వంటి ఎక్సర్‌సైజెస్ వెన్నెముకను సులభంగా సాగేలా చేస్తాయి. తద్వారా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగచ్చు. అలాగే ఈ వ్యాయామాలు వెన్ను, భుజాల కండరాలకు దృఢత్వాన్ని అందించి ఫిట్‌గా మార్చుతాయి.

**యోగాసనాలతో...** కొన్ని రకాల యోగాసనాలు శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాదు.. పిల్లలు ఎత్తు పెరగడానికీ దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీరమంతటికీ చక్కటి వ్యాయామం అందుతుంది. అలాగే భుజాలు, వీపు, కాళ్లలోని కండరాలను బలంగా మార్చి సులభంగా సాగేలా చేస్తుంది. ఇక చక్రాసనం వల్లభుజాలు, పాదాలపై ఒత్తిడి పడుతుంది. తద్వారా అక్కడి కండరాలు దృఢమవడంతో పాటు సాగుతాయి. ఫలితంగా ఎత్తు పెరిగే ప్రక్రియ వేగవంతమవుతుంది.

**స్కిప్పింగ్-స్విమ్మింగ్...** స్కిప్పింగ్ ఆడడమంటే ఆడపిల్లలకు భలే సరదా. ఎంతో సరదాగా చేసే ఈ వ్యాయామం వారి శరీరానికి దృఢత్వాన్ని అందించడమే కాదు.. గుండె ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరుస్తుంది. అలాగే ఈ వర్కవుట్‌లో భాగంగా ఎగిరి దూకే క్రమంలో వెన్నెముక, భుజాలు, కాళ్లలోని కండరాలు ఫ్లెక్సిబుల్‌గా మారతాయి. సులభంగా సాగేలా తయారవుతాయి. ఫలితంగా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగడం ఈజీ అవుతుంది. ఇక ఈత కొట్టే క్రమంలో కూడా శరీరాన్ని ముందుకు సాగదీస్తాం. తద్వారా వెన్నెముకకు చక్కటి వ్యాయామం అందుతుంది. ఇది కూడా ఎత్తు పెరిగేందుకు సహాయపడుతుంది.

మన శరీరంలో హెచ్‌జిహెచ్ అనే పెరుగుదల ప్రేరేపించే హార్మోన్ ఉంటుంది. ఇది పిల్లల్లో నిద్ర పోయినప్పుడు మాత్రమే విడుదల వుతుందట! అందుకే చిన్నారులు ఎంత చక్కగా నిద్రపోతే అంతగా పెరుగుతారంటారు. విటమిన్ 'డి' సైతం చిన్నారులు ఎత్తు పెరిగేందుకు పేరేపిస్తుందంటున్నారు నిపుణులు. ఇది కండరాలు, ఎముకల సామర్థ్యం పెరిగేలా చేసి.. పరోక్షంగా ఎత్తు పెరగడానికి సహకరిస్తుంది. ఇందుకోసం రోజూ కాసేపు ఎండలో నిలబడడం.. చేపలు పుట్టగొడగులు, గుడ్లు.. వంటి విటమిన్ 'డి' అధికంగా ఉండే ఆహార పదార్థాలు వారి డైట్‌లో భాగం చేయడం మంచిది. పిల్లలకు అందించే ఆహారంలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు.. ఇలా అన్ని పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం సీజనల్ పండ్లు అన్ని రకాల కాయకూరలు దుంపలు ఆకుకూరలు వంటివన్నీ వీరి ఆహారంలో చేర్చాలి. □

## దానాలు ఫలించాలంటే..

దానం ఓ మహత్తర కార్యం. నువ్వు ఏ దానం అయినా చేయి కాని కుటుంబ అవసరాలు, నీ జీవితానికి సంబంధించినవి తీర్చుకుని దానం చేయి. అలా కాకుండ కొంత మంది మాకు దానం చేస్తే పుణ్యం వస్తుంది. మేము స్వర్గ సుఖాలు పొంద వచ్చని మూఢంగా దానాలు చేస్తుంటారు. కుటుంబంలో కొడుకులు కావొచ్చు. కూతుర్లు కావొచ్చు వాళ్ల అవసరలకు కొంత మంది, వాళ్ల అనారోగ్యంగా ఉన్నా ఖర్చు పెట్టరు. వేలకు, వేలు వివిధ సంస్థలకు డబ్బు దానం చేస్తుంటారు. అది వారి సొంత డబ్బు అయినా ఎంతో కొంత కుటుంబ అవసరాలకు ఉంచుకుని దానం చేస్తే బాగుంటుంది. ఇది కొంత మందికి నచ్చదు. అందుకే హతమార్చడం చేస్తు న్నారు. ఉదాహరణకు ఓ ముదుసలికి నెల, నెల ప్రభుత్వ పింఛను వస్తుంది. ఆవిడను కొడుకు,కోడలు తరిమివేశారు. కూతురు ఇంటికి వచ్చినా ఆమె చేసే దానాలకు అంతులేదు కూతురు అనారోగ్యంగా ఉన్నా, ఏమి పట్టనట్లుగా డబ్బు దానం చేస్తుడటం ఆమె మూర్ఖత్వం. అట్టి దానాలు ఎప్పటికి ఫలించవు. వీళ్లేమో మేము దానాలు చేశాం మాకు పుణ్యం వస్తుంది అనుకుంటారు. నిజానికి వారు పాపం మూట గట్టుకుం టారు. మా డబ్బు పేదలకు చేరుతుంది కదా అనుకుంటారు. కానీ నీకు అన్ని సమాకూర్చే నీ వాళ్లకు నీవు ఏమి ఖర్చు పెట్టవు. నేను అంత చేశాను, ఇంత చేశాను అని వాళ్లకు మనసులో ఉండొచ్చు కాని ఏవి నీకు మంచి జరగదు. అవసాన దశలో నీవు నీ కుటుంబ సభ్యులు, వాళ్ళ రోగాలకు డబ్బు ఖర్చు పెడితే అదే నీకు పుణ్యం. నువ్వు చేసేది దానం అయినా, ఆ దానంలో నీ వాళ్ళు కూడ ఉన్నారు. నీ వాళ్లకు ఖర్చు పెడితే ఆ పనులకు పెట్టినట్లే. ఇప్పటికైనా ఎవరైనా డబ్బు దానం చేయాలిసివస్తే ముందు కుటుంబ అవసరాలు, తర్వాత దానలు చేస్తే అనంత ఫలితం వస్తుంది. భగవంతుడు కూడ వున్న దానిలో కొంచెం నాకు ఇస్తే నీకు పుణ్యం కలుగుతుంది అని మన పురాణ గ్రంథాలలో, వివిధ మత సగ్రంథాలలో కూడ ఉంది. మొత్తానికి వున్న దానిలో దానంచేస్తే కలిగే ప్రయోజనాలు ఎన్నో. □



## చేతులు మండుతున్నాయా?

వంటన్నాక ప్రతి దానిలో పచ్చి మిర్చిని తప్పక వడుతుంటాం. కొంతమందికి వీటిని కోస్తే చేతులు మండుతాయి. దీనికి కారణం మిర్చిలో ఉండే క్యాప్సైసిన్ అనే రసాయం. ఈచిట్కాలు పాటించడంతో ఉపశమన పొందవచ్చు.

✦ పచ్చిమిరపకాయలు కోసిన వెంటనే టొమాటోలను కోయడమో లేదా ఆ గుజ్జుతో చేతులను శుభ్రం చేసుకుంటేనో మంట తగ్గుతుంది. మరీ ఎక్కువ మంట అనిపిస్తే చపాతీపిండి లేదా పూరీపిండిని కలపడంతో ఉపశమనం కలుగుతుంది. ✦. నిమ్మరసంలో విటమిన్-సి, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉండి మంటను తగ్గస్తాయి. పచ్చిమిర్చి కోస్తే సమస్య ఉన్నవారు నిమ్మచెక్క రసంతో చేతులను రుద్ది కడిగితే యాంటీసెప్టిక్ పనిచేసి మంటను తగ్గిస్తాయి. చేతులూ ఎర్రబడవు. ✦ పచ్చిమిర్చిని కోసిన తరవాత ఐస్‌క్యూబ్స్‌తో కాసేపు చేతులను రుద్దాలి. లేదా కలబంద గుజ్జు రాసినా, చక్కెరతో చేతులను కడిగినా ఉపశమనం లభిస్తుంది. □

## నూనె పీల్చని జొన్న మురుకులు



మురుకులు ఎంతో మంది ఎన్నోరకాలుగా చేస్తారు. బియ్యప్పిండి, మినప్పిండి, పెసర పిండి.. ఇలా చాలా వైరైటీలు ఉన్నాయి. వేటికవే బాగుంటాయి. జొన్నపిండి ఇంకా మంచిది కదా చాలా సులువు కూడా. ఎలా చేయలంటే జొన్న పిండిలో నువ్వులు, వేరుశనగ పొడి, వాము, పచ్చిమిర్చి ముద్ద, ఉప్పు, రెండు చెంచాల వెన్న వేసి.. కొన్ని నీళ్లతో పిండి కలిపి..కాగుతున్న నూనెలో మురుకులు ఒత్తుకోవాలి. ఇవి రుచిగా ఉంటాయి. నూనె కూడా ఎక్కువ పీల్చవు. మూడు కప్పుల జొన్నపిండికి అర కప్పు నువ్వులు, ఒక కప్పు వేరుశనగగుళ్లు, ఒక టేబుల్ స్పూన్ వాము, మూడు పచ్చిమిర్చి అవసరమౌతాయి. వేరుశనగ గుళ్లను వేయించి పొట్టు తీసి, గ్రైండ్ చేయాలి. పిల్లలు చిప్స్ లాంటి స్నాక్స్ తింటే వాటిల్లో ఉండే ప్రిజర్వేటివ్స్ వల్ల జబ్బులపాలవుతారు. ఇలాంటి చిరుతిళ్లు పెడితే ఆరోగ్యంగా, పుష్టిగా ఉంటారు. ముఖ్యంగా దయాబెటిస్‌తో బాధపడేవారికి ఇవెంతో ఉపశమనం కలిగిస్తాయి. పిల్లలు ఇంకా కావాలంటూ ఇష్టంగా తింటారు.. ఈ జొన్నమురుకులు మీరూ ఒకసారి చేసి చూడండి. □



## మైత్రీ మూవీ మేకర్స్ 4వ తమిళ చిత్రం పూజా కార్యక్రమం ప్రారంభం



ప్రముఖ పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ ఖిమైత్రీ మూవీ మేకర్స్‌ఖి కేవలం తెలుగు పరిశ్రమకే పరిమితం కాకుండా ఇతర భాషల్లోనూ భారీ చిత్రాలను నిర్మిస్తోంది. ఈ క్రమంలో వారి నాలుగవ తమిళ చిత్రాన్ని ప్రకటించారు. ధృవ్ విక్రమ్ హీరోగా నటిస్తున్న నాలుగవ చిత్రం కావడం విశేషం. పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రానికి కరణ్ అరవింద్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. చెన్నైలోని ఎంఆర్‌సి నగర్ మైత్రీ ఆఫీస్ లో జరిగిన పూజా కార్యక్రమంతో MythriTamil04 DV4 ప్రాజెక్ట్ అధికారికంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి చిత్ర బృందం, పలువురు ప్రముఖ అతిథులు హాజరయ్యారు. ధృవ్ విక్రమ్, దర్శకుడు కరణ్ అరవింద్ కుమార్, చిత్ర బృందంతో కలిసి ఈ శుభకార్యంలో పాల్గొన్నారు. ముహూర్తం షాట్ కు దర్శకుడు కీర్తిశ్వరన్ క్లాప్‌బోర్డ్ కొట్టారు. దర్శకులు అధిక్ రవిచంద్రన్, రవికుమార్, కీర్తిశ్వరన్, ఆంటోనీ భాగ్యరాజ్, రాజా, శశి, 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యువ్ ఈ ప్రారంభోత్సవ వేడుకకు హాజరయ్యారు.నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం (డివి4), ధృవ్ విక్రమ్‌ను పూర్తిగా మాస్ ఒరియెంటెడ్ అవతార్‌లో కనిపించ నున్నారు. నటనకు ప్రాధాన్యతనిచ్చే పాత్ర లతో ప్రయోగాలు చేయ డానికి పేరు పొందిన ధృవ్ , ఇప్పుడు మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతున్న ఒక కమర్షియల్ ఎంటర్‌టైనర్ కోసం సిద్ధమయ్యారు. కరణ్ అరవింద్ కుమార్, సబీతో కలిసి ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లేను కూడా అందించారు. ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక బృందం పని చేస్తోంది.

## దర్శకుడు మెహర్ రమేష్ కుమార్తె వివాహం:

### నూతన దంపతులను ఆశీర్వదించిన చిరంజీవి దంపతులు



దర్శకుడు మెహర్ రమేష్ కుమార్తె మోహన వివాహం అనిరుధ్‌తో వైభవంగా జరిగింది. ఈ పెళ్లి వేడుకకు మెగాస్టార్ చిరంజీవి సతీసమేతంగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.ఈ వివాహ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన అనేక మంది ప్రముఖులు హాజరై సందడి చేశారు. ముఖ్యంగా . పవన్ కల్యాణ్, ఆయన అర్ధాంగి అన్నా లెజెనోవాతో కలిసి విచ్చేసి కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. టాలీవుడ్ నుంచి అగ్ర హీరో వెంకటేశ్, ప్రముఖ దర్శకులు వీవీ వినాయక్, శ్రీను వైట్ల, ఎన్. శంకర్, వీర శంకర్, నిర్మాతలు అల్లు అరవింద్, సి. అశ్వినీదత్, ఏఎం రత్నం, బన్నీ వాసు, రచయితలు కోన రవి, నటుడు మురళీ మోహన్, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా, యాంకర్ సుమ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రాజకీయ రంగం స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, గంటా శ్రీనివాస్, అంబటి రాంబాబు వంటి నేతలు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

## 'నాగబంధం' థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్: డైరెక్టర్ అభిషేక్ నామా



నాగబంధం జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిషేక్ నామా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**నాగబంధం ఆలోచన ఎప్పుడు వచ్చింది?**

పద్మనాభస్వామి ఆలయంలో వాల్ట్ బి ఎందుకు తెరవలేదనే విషయంలో చాలా చర్చలు జరిగాయి. దానిపై ఎన్నో కథలు ఉన్నాయి. ఆ గదిలోపల ఏముందనేది అందరికీ ఎంతో ఆసక్తికరం. నిజంగా ఆ గది తెరిస్తే అందులో ఏముంటుందో ఊహిస్తూ ఒక కథ చేస్తే బాగుంటుందని అనిపించింది. దాన్ని బ్యాక్‌డ్రాప్‌గా తీసుకుని ఒక ఫిక్షనల్ స్టోరీ చేయాలనిపించింది. అలా నాగబంధం కథను రాశాను.

**ఇలాంటి కథలకు పెద్ద హీరోలు అయితే బాగుంటుంది కదా. మీరెందుకు కొత్తవాళ్లతో చేశారు?**

నిజానికి ఈ కథ అనుకున్నప్పుడు ఎవరితో చేయాలనే ఆలోచన లేదు. మంచి కథ చెప్పడంపైనే నా దృష్టి అంతా ఉంది. కథ పూర్తయిన తర్వాత దానికి ఎవరు బాగా సరిపోతారో వారిని ఎంపిక చేశాం.ఇది నేను విజువలైజ్ చేసుకున్న కథ.

**విరాట్ కర్ణలాంటి కొత్త హీరోతో వంద కోట్లకు పైగా సినిమా చేయడం వెనుక కారణం?**

నిజానికి ఈ కథ మొదలుపెట్టినప్పుడు వంద కోట్ల బడ్జెట్ అవుతుందని అనుకోలేదు. కొత్త నటుడితో సినిమా చేయాలని అనుకున్నాను. .

**నిర్మాతల గురించి?** మా నిర్మాతలు మొదటి నుంచి కథను, నన్ను పూర్తిగా నమ్మి సినిమా కోసం ఖర్చు చేశారు. ఎలాంటి లెక్కలు వేసుకోకుండా కథకు ఏం అవసరమో అది అందించారు.

**మైథాలజీ అంశాలతో సినిమా చేయడం పెద్ద టాస్క్ కదా. ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

ఇది మైథాలజీ మాత్రమే కాదు, ఒక కమర్షియల్ సినిమా కూడా. కుటుంబమంతా కలిసి చూడదగ్గ సినిమా.

**హిందీలో ఎలాంటి స్పందన ఉంది?**

బాలీవుడ్‌లో చాలా మంచి స్పందన వచ్చింది. దాదాపు 700కి పైగా స్క్రీన్లలో విడుదల అవుతోంది. **ఇంత భారీ సినిమా చేయాలని ఎప్పుడు నిర్ణయించుకున్నారు?**

డెవిల్ తర్వాత ఒక కథ చేయాలనుకున్నాను. కొంతకాలం దానిపైనే ప్రయాణించాను. అయితేచేస్తే అందరూ గుర్తుపెట్టుకునే పెద్ద సినిమా చేయాలనిపించి ఈ సినిమాను మొదలుపెట్టాను.

## పాన్ ఇండియా ఫీచర్ ఫిల్మ్ 'వనజీవి రామయ్య'



వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'వనజీవి రామయ్య' మూవీ టీమ్ సమక్షంలో ఘనంగా వనజీవి 90వ జయంతి సందర్భంగా వనజీవి హరిత అవార్డు పురస్కార మహో త్సవం..పరావరణ పరిరక్షణకు విశేష సేవలందించిన పలువురికి సత్కారం తెలంగాణ రాష్ట్రంలోని పల్లె ప్రకృతి వనాలకు వనజీవి రామయ్య పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి

కోటి మొక్కల రామయ్యగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన పర్యావరణ ఉద్యమకారుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి దరిపల్లి రామయ్య సేవలను చిరస్థాయిగా నిలబెట్టే ఉద్దేశంతో రూపొందిన లఘుచిత్రం 'వనజీవి రామయ్య' మూవీ టీమ్ సమక్షంలో, వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనజీవి అవార్డు పురస్కార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాస్విక్ గ్రూప్ చైర్మన్, సినీ నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి, వాస్విక్ ఫౌండేషన్ వైస్ చైర్మెన్ నూకల భాస్కర్ రెడ్డి, దర్శకుడు వేముగంటి తదితరులు నాయకత్వం వహించారు. సమాజానికి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని అందించిన మహనీయుడు దరిపల్లి రామయ్య జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించిన 'వనజీవి రామయ్య' లఘుచిత్రం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేసే 'గద్దర్ అవార్డ్స్'లో ఉత్తమ లఘుచిత్రాల విభాగానికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా మొక్కల సత్యనారాయణ, మొక్కల వెంకటయ్య మాట్లాడుతూ, ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి మాట్లాడుతూ, 'నీటి కరువు, పర్యావరణ సంక్షోభం వంటి సమస్య లను సుమారు 50 ఏళ్ల క్రితమే ముందుగానే గుర్తించి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చిన దూరదృష్టి కలిగిన మహనీయుడు వనజీవి రామయ్య. దర్శకుడు వేముగంటి మాట్లాడుతూ, 'దాదాపు ఏడు దశాబ్దాల పాటు తన జీవితాన్నే మొక్కల కోసం అంకితం చేసిన వనజీవి రామయ్యను భావితరాలు ఎన్నటికీ మరచిపోకూడదు.

## ' ముపాపా' ఫిబ్రవరి 19, 2027న రిలీజ్

'ముపాపా' ఫిబ్రవరి 19, 2027న రిలీజ్బాలీవుడ్ వెర్సటైల్ స్టార్ ఆయుష్మాన్ ఖురానా హీరోగా



యశ్ రాజ్ ఫిల్మ్స్, పోషమ్ పా పిక్చర్స్ బ్యానర్స్‌పై రూపొందు తోన్న చిత్రం 'ముపాపా'. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సిఇఒ అక్షయ్ విదాని ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఇండియన్ మూవీస్‌లో ప్రముఖ షో రన్నర్, డైరెక్టర్ సమీర్ సక్సేనా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈయన నిర్మిం చిన గత చిత్రం సయారా హయ్యస్ట్ గ్రాసర్ సాధించిన రొమాంటిక్ మూవీగా ఇండియన్ సినిమాలో రికార్డ్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. ముపాపా చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 19న రిలీజ్ కానున్నట్లు మేకర్స్ తెలియజేశారు. యశ్ రాజ్ ఫిల్మ్స్‌లో కొత్త క్రియేటివ్ బిజినెస్ మోడల్‌ను నిర్మించానే ఆదిత్య చోప్రా విజన్‌కు అనుగుణంగా ఈ భాగస్వామ్యం ఉంది. కంపెనీ సీఈఓ అక్షయ్ విదాని నేతృత్వంలో.. ఆయన నిర్మాతగా స్టూడియో ఈ మోడల్‌ను వ్యూహాత్మకంగా అభివృద్ధి చేస్తున్నారు. ముపాపా" ఓ వినూత్నమైన థియేట్రికల్ చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. థియేటర్లలో ప్రేక్షకులకు పూర్తిగా కొత్త విజువల్ అనుభూతిని అందించనుంది. డిఫరెంట్ కంటెంట్ మూవీస్‌తో ప్రేక్షకులను అలరిస్తోన్న ఆయుష్మాన్ ఖురానా ఇందులో కథానాయకుడు. అనౌన్స్‌మెంట్ నుంచే ఈ మూవీ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కాలా పానీ, మామ్లా లీగల్ హైస వంటి ప్రేక్షకాదరణ పొందిన సినిమాల్లో భాగమైన పోషమ్ పా పిక్చర్స్ పార్ట్‌నర్స్ సమీర్ సక్సేనా, బిస్వపతి సర్కార్, సౌరభ్ ఖన్నా, అమిత్ గోలాని ఇందులోనూ భాగమయ్యారు.

## లవ్ స్టోరీ 'కాగితం పడవలు' 24న

### గ్రాండ్‌గా రిలీజ్



వర్ధన్, కృష్ణప్రియ హీరో హీరో యిన్స్‌గా ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ కాగితం పడవలు. ఎస్‌ఎల్‌ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కీర్తన నరేష్ టి.ఆర్. ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజ నప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ట్రైలర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా చిత్ర బృందం విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. జూలై 24న ఈ చిత్రం ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతిష్టాత్మకమైన పంపిణీ సంస్థల్లో ఒకటైన ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండటం విశేషం.ఒక సినిమా కంటెంట్‌పై బలమైన నమ్మకం ఉన్నప్పుడే ఇలాంటి ప్రముఖ సంస్థలు ముందుకు వస్తాయి. దీంతో 'కాగితం పడవలు' పై పరిశ్రమ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ మరింత ఆసక్తి నెలకొంది.ఈ చిత్రానికి ఎఐఎస్ నౌఫల్ రాజామ్యూజిక్ అందిస్తున్నారు. రుద్రసాయి డీవోపీగా పని చేస్తున్నారు, జెస్విన్ ప్రభు ఎడిటర్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం.హిమ బిందు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

3-7Pg8exHMNWJQE:3-7Pg8exHMNWJQE.qxd 7/2/2026 11:57 PM Page 1



# గురుకులాల్లో అవినీతి జరగలేదన్న మంత్రులు పొన్నం, అడ్లూరి, అజారుద్దీన్



గురువారం అమరవీరుల స్తూపం వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అజారుద్దీన్ తదితరులు

## చర్చకు సిద్ధంగా ఉన్నామని అమరవీరుల స్తూపం దగ్గరకు వచ్చిన మంత్రులు

### చర్చకు వస్తే ప్రెస్‌క్లబ్‌లో చర్చిద్దామని మంత్రుల సవాల్

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గురుకులాల్లో అవినీతిపై మంత్రులు, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు జరిగాయి. గురుకులాల్లో అవినీతి జరిగిందని ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ఆరోపించగా.. ఎక్కడా అవినీతి జరగలేదని టెండర్లు పారదర్శకంగా జరిగాయని వివిధ సంక్షేమ శాఖల మంత్రులు ప్రకటించారు. అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చర్చకు రావాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, మహ్మద్ అజారుద్దీన్ గురువారం ఉదయం అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్తూపం దగ్గరకు వచ్చారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు ఎవరూ వచ్చిన చర్చకు సిద్ధంగా ఉన్నామని, వస్తే ప్రెస్‌క్లబ్‌లో చర్చిద్దామని సవాల్ విసిరారు. మొత్తం టెండర్లు రూ. 1143 కోట్లన్నారు. బీఆర్ఎస్ నేతలు ఒకసారి రూ.2 వేల కోట్లు అని మరోసారి రూ. 3 వేల కోట్లు అని ఆరోపణలు చేశారు ప్రవీణ్ కుమార్ కరీంనగర్ ఎస్పీగా ఉన్నప్పుడు విద్యార్థి నాయకులుగా మా నిజాయితి తెలుసునని, తాము చర్చ చేయడానికి గన్ పార్క్ వద్దకు వచ్చామన్నారు. మొత్తం కొనుగోలు ప్రక్రియలో రూ. 687.77 కోట్లు టెండర్లు, ప్రభుత్వ రంగ సంస్థలు రూ. 455.23 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. టెండర్లు రూ.1143 కోట్లు అయితే రూ. 2 వేల కోట్లు, రూ.3 వేల కోట్లు అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు మఫాత్‌లాల్ బట్టలు ధరించవద్దా, మాఫత్ లాల్ మాకు ఏమైనా చుట్టమా? తెలంగాణ పోరాట వీరులుగా మేము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నువ్వు ఐపీఎస్‌గా చేసిన వ్యక్తివి చట్టసభల్లో లేవు.. మాజీ మంత్రులు చర్చకు రావాలని మంత్రి పొన్నం సవాల్ విసిరారు. దేవాలయం లాంటి శాసనసభలో ఆరోపణలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, మొత్తం టెండర్లు రూ.2 వేల కోట్లు కాదన్నారు. ప్రవీణ్ కుమార్ సెక్రటరీగా 10 సంవత్సరాలుగా సోషల్ వెల్ఫేర్‌లో మీరు చేసిన అవినీతిపై విచారణ చేయాలని సీఎంకు ముగ్గురం మంత్రులం లేఖలు రాస్తామన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ గత 10 సంవత్సరాలుగా అవినీతి చేసిన వ్యక్తి అని, ఏదో మాట్లాడడం కాదని, తాము తెలంగాణ అమరవీరుల స్థూపం దగ్గర అసెంబ్లీ ముందు ఉన్నామని, చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రెస్ క్లబ్‌కి కూడా రావడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే ఎవరికి పడితే వారికి జవాబు చెప్పబోమని, మాజీ మంత్రులు రావాలి, మీ దగ్గర ఆధారాలు తీసుకొని రావాలని సవాల్ విసిరారు. తాము అవినీతి చేసినట్టు నిరూపిస్తే మీ దగ్గర ఆధారాలు చూపిస్తే మేము ముక్కు నెలకు రాసి రాజీనామా చేస్తామన్నారు. శాసన సభకి రండి చర్చిద్దాం, లేదా ప్రెస్‌క్లబ్‌కి మేము మంత్రులుగా వస్తాం మీ మాజీ మంత్రులు రావాలన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. గురుకుల టెండర్లపై బహిరంగ చర్చకు సిద్ధమంటూ ఇప్పుడు ప్రతిపక్ష నాయకులు వెనక్కి తగ్గడం ఎందుకని ప్రశ్నించారు. గురుకులాల టెండర్ల ప్రక్రియ మొత్తం అత్యంత పారదర్శకంగా, నిబంధనల మేరకే జరిగింది. రూ.686 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచాం... ప్రతి దశకు పూర్తి వివరాలు, ఆధారాలు మా వద్ద ఉన్నాయి. దాదాపు రూ.400 కోట్ల పనుల్లో ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రాధాన్యత కల్పించాం. ఎక్కడా అవకతవకలకు, అక్రమాలకు, పొరపాట్లకు తావులేకుండా టెండర్ల ప్రక్రియను నిర్వహించామన్నారు. హరీశ్‌రావుతో పాటు ఆయన భజన బృందం చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవన్నారు. ఆరోపణలు చేయడం కాదు... ఆధారాలతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. పేద పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం పనిచేస్తుంటే... ప్రతిపక్షం రాజకీయ లబ్ధి కోసం అడ్డంకులు సృష్టిస్తోందని మండిపడ్డారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేస్తున్న ఆరోపణలకు మా పార్టీ అధికార ప్రతినిధులే తగిన సమాధానం చెబుతారనన్నారు. స్పీకర్ వెంటనే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని, గురుకుల టెండర్లతో పాటు అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరగాలి. చర్చకు తేదీ, సమయం నిర్ణయించండి... ఆధారాలతో వచ్చి నిజాలు వెల్లడిస్తామని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.

# సిఎం, మంత్రులు తొడగొట్టి తోకముడిచారు

## మంత్రి జూపల్లి కోసం తెలంగాణభవన్‌లో కుర్చీ వేసి ఉంచాం

## మేం గన్‌పార్క్‌కు వెళ్లకుండా పోలీసులతో అడ్డుకుని డ్రామాలు ఆడారు

## ముఖ్యమంత్రికి చర్చించే దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టాలి

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఫైర్



గురువారం పోలీసులతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వాగ్వాదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై2:** అప్పులపై చర్చకు సిద్ధమని సవాళ్లు విసిరిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రులు తీరా సమయం వచ్చేసరికి తోకముడిచి పారిపోయారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. సవాల్ విసిరి చేతకాక పారిపోయిన ఈ సన్నాసుల బాగోతాన్ని రాష్ట్ర ప్రజలంతా కళ్లారా చూశారని ఆయన మండిపడ్డారు. తానే స్వయంగా తెలంగాణ భవన్‌కు వస్తున్నానని ప్రగల్భాలు పలికిన మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం ప్రత్యేకంగా కుర్చీ వేసి, శాలువాతో మూడు గంటలపాటు వేచి చూసినా రాలేదని కేటీఆర్ మండిపడ్డారు. మంత్రి రాకుండా మొహం చాటేయడంతోపాటు మరో చోట డ్రామాకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి గన్ పార్క్ వద్ద చర్చకు సిద్ధమై బయలుదేరిన హరీశ్‌రావును ఇతర నేతల్ని అరెస్టు చేయడం, మమ్ములను అడుగడుగునా అడ్డుకోవడం సిగ్గు చేటు అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. అక్కడ కూర్చుని మంత్రులు సవాళ్లు విసరడం, ఇక్కడ పోలీసులను పెట్టి అడ్డుకోవడం ఈ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం అని దుయ్యబట్టారు. కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్‌లోకు తరలించిన నేతలను పరామర్శించేందుకు కూడా వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి, మంత్రులకు నిజంగానే చర్చించే దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని కేటీఆర్ సవాల్ విసిరారు. సభలో మైక్ కట్ చేయకుండా తమకు మాట్లాడే అవకాశం ఇస్తే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వ రెండున్నరేళ్ల డొల్ల తనాన్ని, అవినీతి బండారాన్ని మొత్తం బట్టబయలు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన అబద్ధపు హామీలు, పరిపాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం నిత్యం ప్రయత్నిస్తోందని, ఇలాంటి శిఖండి రాజకీయాలను తెలంగాణ ప్రజలు అస్సలు సహించరని హెచ్చరించారు. రెండున్నరేళ్లలో అనుముల బ్రదర్స్ రాష్ట్రాన్ని నిలువునా దోచుకుంటున్నారని, అదానిని మించిన ఆస్తులు కూడబెట్టారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం 2.80 లక్షల కోట్ల అప్పు చేసిందని ఆర్బీఐ, కాగ్ లెక్కలు చెబుతుంటే, సీఎం, డిప్యూటీ సీఎంలు పొంతన లేని కాకి లెక్కలతో ప్రజలను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని స్వయంగా ప్రధానమంత్రి మాట్లాడినా, ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని బీజేపీని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై జరిగిన ఇడి దాడుల విచారణ ఏమైందో బండి సంజయ్ సమాధానం చెప్పాలన్నారు. అమృత్ టెండర్లలో జరిగిన భారీ అవినీతిపై ఎందుకు విచారణ జరపడం లేదని, కాంగ్రెస్ సర్కారులో బీజేపీ ఎంపీలకు కాంట్రాక్టులు ఎలా దక్కుతున్నాయో సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు, చీకటి ఒప్పందాలు తెలంగాణ ప్రజలకు అర్థమయిపోయాయని కేటీఆర్ విరుచుకు పడ్డారు. సీఎం, మంత్రులు ఇవాళ పారిపోయినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, నాలుగు కోట్ల ప్రజల పక్షాన నిత్యం ప్రజాక్షేత్రంలో నిలదీస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఒకే వేదికపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పొంతన లేని గణాంకాలు చెప్పి అడ్డంగా దొరికిపోయారని ఎద్దేవా చేశారు. గతంలో నోట్ల కట్టలతో దొరికిన రేవంత్‌కు రాష్ట్రంలో విశ్వసనీయతే లేదని కేటీఆర్ మండిపడ్డారు. కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. పొంగులేటి కుమారుడు వట్టినాగులపల్లిలో కంపెనీలపై పడి భూములను దోచుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. మేం హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టాం. దమ్ముంటే పొంగులేటి లక్షా ఒకటో ఇల్లు కట్టి చూపించాలని సవాల్ విసిరారు. దగాకోరు, అవినీతి పాలనపై రాజీలేని పోరాటం చేసి కాంగ్రెస్ ముసుగును తొలగిస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే రైతు సంగ్రామసదస్సులు, యువజన, విద్యార్థి సదస్సుల ద్వారా కాంగ్రెస్ మోసాలను ఎక్కడికక్కడ నిలదీసి, ప్రజలను చైతన్యవంతం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.



గురువారం సచివాలయంలో మంత్రి సీతక్క నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతిపత్రం అందజేసిన గిరిజన ఎమ్మెల్యేలు

# ఏజెన్సీలోని నియోజకవర్గాల్లో అదనంగా 2వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

### సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గిరిజన ఎమ్మెల్యేలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 2:** తెలంగాణకు చెందిన ఆదివాసి,గిరిజన శాసన సభ్యులు పలు అంశాలపైన సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాలు అందించారు. గురువారం సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నేతృత్వంలో వారు సిఎంను కలిసి ఏజెన్సీ ప్రాంతంలోని నియోజకవర్గాల్లో అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతోపాటు ఇందిర గిరిజల వికాసం పథకం అమలు చేయాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలి. ఐటీడీఏ లను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అశ్వరావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ, పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య, భద్రాచలం ఎంఎల్ఏ తెల్లం వెంకట్‌రావు, ఖానాపూర్ ఎంఎల్ఏ వెడ్మ బొజ్జు ఉన్నారు, ఈ సందర్భంగా సిఎం వద్ద జరిగిన సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ పాల్గొన్నారు.

# గుడిసెలకు పట్టాలివ్వాలని 6న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

### వామపక్షాల తీర్మానం

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న గుడిసెలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ధర్నా చేపట్టాలని రాష్ట్రంలోని లెఫ్ట్ పార్టీలు తీర్మానించాయి. గురువారం తెలంగాణ రాష్ట్రంలోని లెఫ్ట్ పార్టీలు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నాయి. రాష్ట్రంలోని గుడిసె వాసులందరికి పట్టాలు ఇచ్చి, పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. విద్యానగర్‌లోని సిపిఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యాలయం మార్క్స్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో తీర్మానం చేశాయి. ప్రతి గుడిసెకు పట్టా- పేదవాడికి ఇల్లు అనే నినాదంతో ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద భారీ ధర్నా నిర్వహించాలని లెఫ్ట్ పార్టీలు నిర్ణయించాయి. దీంతోపాటు ఏజెన్సీ ప్రాంతంలో గల లక్షలాది ఎకరాల్లో సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కూడా ఈ ధర్నా లో డిమాండ్ చేస్తామని వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు సాదినేని వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పశ్య పద్మ, ఇటి నర్సింహా, సిపిఎం కార్యదర్శి జాన్ వెస్లీ, అబ్బాస్, సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె. గోవర్ధన్, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ఎం.హన్మేశ్, ఎంసిపిఐ రాష్ట్ర నాయకులు వనం సుధాకర్, ఎస్‌యుసిఐ నాయకులు భరత్ పాల్గొన్నారు.

# ఫీజులు చెల్లిస్తారా.. లేదా గద్దె దిగుతారా?

### ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బిసి జెఎసి

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని బీసీ జేఏసీ రాష్ట్ర నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం బిసి జేఏసీ ఇచ్చిన కళాశాలల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా బర్కత్ పుర చౌరస్తా వద్ద విద్యార్థులతో కలిసి శాసనమండలి బిఆర్ఎస్ పక్షనాయకుడు ఎస్.మధుసూదనాచారి, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, కో చైర్మన్ గుజ్జ కృష్ణ రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. తెలంగాణలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఉన్నారని, కానీ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలు సర్టిఫికెట్లు నిలిపివేయడం, విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిధులు విడుదల చేసి పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# బిఆర్ఎస్ గూండాగిరికి భయపడేది లేదు..

### మీ ప్రవర్తన ఇలాగే ఉంటే భవిష్యత్తులో ప్రతిపక్ష హోదా కూడా గల్లంతు: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 2:** రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ గూండాగిరికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడేది లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై స్పందించారు. కోట్లాది రూపాయిలు కొల్లగొట్టిన బిఆర్ఎస్ నాయకులు ఇంకా అధికారంలోనే ఉన్నాం లేదా మళ్లీ అధికారంలోకి వస్తామనే భ్రమతో మాట్లాడుతున్నారు. వారి అవినీతి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీ సాక్షిగా బయటపెట్టారు.

అయినా ఇంకా అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటూ ఈ ప్రభుత్వంపై గుడ్డకాల్చి వేసినట్లు మాట్లాడుతున్నారు. గత పదేళ్లలో వారు అంటించుకున్నబురదను ఇప్పటి ప్రభుత్వానికి లేదా మంత్రులకు అంటించాలని చూస్తున్నారు. ఐదేళ్ల పాలనకు ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిస్తే మతి భ్రమించి రెండున్నరేళ్లకే గద్దె దిగమని డిమాండ్ చేయడం హాస్యాస్పదం. ఈ రెండున్నర సంవత్సరాలలో ఏం జరిగిందో ఎలాంటి తీర్పులు వచ్చాయో రాష్ట్రప్రజలకు, దేశానికి తెలుసు.

ఏ శాఖ అయినా సరే పిలిచిన టెండర్ మొత్తం కంటే మూడు నాలుగు రెట్లు అవినీతి జరిగిందని ఆరోపించడం వారి అవివేకానికి నిదర్శనం. ఇలాగే వారి ప్రవర్తన కొనసాగితే రానున్న కాలంలో వారికి ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. మీ సవాల్‌ను స్వీకరించి మా మంత్రులు వస్తే మీరు రాకుండా పరారయ్యారు.

మా మంత్రులు అక్కడే గంట వరకూ వేచి చూసి మీడియాతో మాట్లాడి వచ్చారు. అసెంబ్లీ లో కూడా మీరు ఏం మాట్లాడతారో మాకు తెలుసు. దానికి కూడా తేదీని ఖరారు చేస్తాం.. అని పొంగులేటి అన్నారు.

# రేవంత్‌రెడ్డిని ఎదుర్కోలేక అసెంబ్లీకి ముఖం చాటేసిన కెసిఆర్

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రేవంత్ రెడ్డిని ఎదుర్కోవడం చేత గాకనే కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారనీ, హరీష్, కెటిఆర్ లతో రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షనేత పరిస్థితి కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్లు ఉందని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు.ప్రతిపక్ష నేత అసెంబ్లీ చర్చలకు రావాలని కోరేందుకు తాను స్వయంగా కెసిఆర్‌కు ఫోన్ చేశానని, అయితే ఆయన తన ఫోన్ కాల్ కు స్పందించలేదని ప్రభుత్వ విప్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం అద్దంకి దయాకర్ సిఎల్‌పి కార్యాలయంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం చర్చల కోసం కెసిఆర్‌ను అసెంబ్లీకి రావాలని కోరుతున్నారని, కానీ ప్రతిపక్షనేతగా ఆయన బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు బిఆర్ఎస్ ముఖ్య నేతలు కెటిఆర్, హరీశ్ రావుల, కవితలు కేవలం సైడ్ యాక్టర్లు మాత్రమే అని అభివర్ణించారు.

ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం కొడుకు, అల్లుడు పోటీ పడుతున్నారనీ అన్నారు. వీళ్లు మాకు లెక్కే కాదు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని అద్దంకి దయాకర్ మండిపడ్డారు. బిజెపితో బేరసారాలను పెంచుకోవడం కోసమే కెటిఆర్, హరీశ్ రావు ప్రయత్నాలు చేస్తున్నారనీ ఆరోపించారు. 70 సీట్లు మీకు 30 మాకు ఇవ్వాలని బిఆర్ఎస్ నాయకులు బిజెపిని బతిమాలు కుంటు న్నారు. కెసిఆర్ ప్రతిపక్ష నాయకుడు కాకపోతే ఆయన ఊసు కూడా ఎత్తే వాళ్లం కాదు. తెలంగాణ చరిత్రలో హీనుడుగా మిగిలిపోకుండా కెసిఆర్ బయటకు రావాలి. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ప్రజలు ఇచ్చిన స్థాయి అని అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వంపై విషప్రచారం చేయడానికి చేసే విన్యాసాలకు కల్వకుంట్ల కుటుంబానికి ఆస్కార్ అవార్డు ఇచ్చినా తక్కువే అన్నారు.

# అప్పులు చేయలేదని కెసిఆర్ చెబితే రాజీనామాకు సిద్ధం

## చర్చకు బావ ఓచోట.. బామ్మర్ది మరోచోట ఎందుకు, ఇద్దరు రండి: మంత్రి జూపల్లి కృష్ణారావు

### ప్రజలతో ముఖాముఖిలో మంత్రి జూపల్లికి 60 మంది వినతులు



గాంధీభవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏడు లక్షల రూపాయల అప్పు చేసిందని ఆ అప్పుల వివరాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అబ్కారీ, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

గాంధీభవన్‌లో గురువారం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని 60మంది నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కోసమే 74వేల కోట్లరూపాయలు అప్పులు చేశారనీ నేను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నాను తాము అప్పులు చేయలేదని కెసిఆర్ చెప్పాలి నేను చెప్పింది అబద్దమైతే రాజీనామా చేసందుకు సిద్దంగా ఉన్నాను. కాళేశ్వరం కార్పొరేషన్ పేరుతో అప్పులు చేసి కట్టిన ప్రాజెక్టు వ్యయం తిరిగి బ్యాంకుకు రైతుల నుంచి వసూలు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు.

ఒక్కోరైతు నుంచి రూ.20లక్షలు వసూలు చేస్తారా? అని అడిగారు. మేం చేసిన ఆరోపణలపై కెసిఆర్ ఎందుకు స్పందించడంలేదు . హరీష్‌రావు కెటిఆర్ ఇంకా బుకాయిస్తున్నారు. కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు నేను స్పందిస్తే ప్రతిస్పందనగా హరీష్‌రావు గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు వస్తానన్నారు.

అందుకే చెబుతున్నాను బావ ఒక చోట బామ్మర్ది మరోచోట మాట్లాడటంఎందుకు ఇద్దరు కలిసి గన్‌పార్క్‌కు రండి మీ ఇద్దరికి ఒకసారే అక్కడే సమాధానం ఇస్తాను అని అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ చేసిన అప్పులపై కెసిఆర్ స్వయంగా ప్రజలకు చెప్పాలనీ గతప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు ఆరువేల కోట్ల వడ్డీ కడుతున్నామని జూపల్లి ఆవేదన చెందారు.

# నూతన హెల్త్ స్కీమ్‌ను వెంటనే అమల్లోకి తీసుకురావాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నూతన హెల్త్ స్కీమ్‌ను వెంటనే అమల్లోకి తీసుకు రావాలని ఉపాధ్యాయఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన హెల్త్ స్కీమ్‌ను వెంటనే అమల్లోకి తేవాలని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును కోరారు. నూతనంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సంజయ్ జాజును సచివాలయంలో కలిసిన ఎమ్మెల్సీ సీఎస్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లా డుతూ.. నూతన హెల్త్ స్కీమ్ ప్రారంభించి రెండు మాసాలు ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల వేతనం నుండి మినహాయింపులు జరిగినప్పటికీ హెల్త్ కార్డులు మంజూరు చేయకపోవడంతో.. ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీఎస్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా ఉద్యోగ విరమణ చెందిన సీపీఎస్ ఉద్యోగుల మూలవేతనంపై నిర్ణయం, భార్యాభర్తలు ఇద్దరివద్ద మినహాయించిన మొత్తాన్ని వెంటనే ఒకరికి తిరిగి చెల్లింపు జరపాలని కోరారు. ఈ స్కీమ్‌లో అన్ని యాజమాన్యాల, గురుకుల ఉపాధ్యాయులతోపాటు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను కూడా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ ట్రస్టుకి సంబంధించిన కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేసి ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించి వెంటనే స్కీమ్‌ను అమలుపరచాలని కోరారు.

అంతేకాకుండా ఈ స్కీమ్‌ను ప్రైవేటు యాజమాన్యాలలోని ఉద్యోగ, అధ్యాపకులకు కూడా వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సీఎస్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి తెలిపారు. సీఎస్‌ను కలిసినవారిలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి, పిఎంటిపిఏ రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీష్, పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

# తెలంగాణ వేదపండితులకే ఆలయాల్లో అవకాశం

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త :** తెలంగాణ వేదపండితులకు మాత్రమే దేవాలయాల్లో పూజారులుగా అవకాశం కల్పిస్తామని ప్రాంతీయేతరులకు ఎలాంటి అవకాశాలు ఇవ్వమని దేవాదాయశాఖ సిఎంఇ ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం, బాసర,యాదాద్రి దేవాలయాల్లో ఇతర రాష్ట్రాల వారికి అవకాశం కల్పించామనే ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని తెలిపారు. వేదపండితులు తెలంగాణ వారు మాత్రమే నియామకాల్లో దరఖాస్తు చేసుకొనేలా నిబంధనలు మార్పుచేశామని తెలిపారు.తెలంగాణ ప్రాంత వేదపండితుల దరఖాస్తులకు మాత్రమే అనుమతి లభిస్తోందని సిఇఇ ఎంఎంరావ్ తెలిపారు. వేదపండితుల సంక్షేమంకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# కెటిఆర్‌ను కలిసిన పోలీసు ఉద్యోగాల అభ్యర్థులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 2:** రాష్ట్రంలో 20 వేల పోలీసు ఉద్యోగ ఖాళీలు ఉంటే కేవలం 5000 ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ వేస్తామని ప్రభుత్వం దారుణంగా మోసం చేస్తుందని పోలీసు ఉద్యోగాల అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. గురువారం పలువురు అభ్యర్థులు తెలంగాణ భవన్‌కు తరలివచ్చి కేటీఆర్‌ను కలిసారు. పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్ కోసం రెండున్నరేళ్లుగా తాము కోచింగ్ తీసుకుని సిద్ధమైతే ప్రభుత్వం తూతూ మంత్రంగా నోటిఫికేషన్ వేసి చేతులు దులుపుకునే కుట్ర చేస్తుందని కేటీఆర్ దృష్టికి తెచ్చారు. నిరుద్యోగుల నిరసనలతో అశోక్ నగర్ చిక్కడపల్లి తో పాటు దిల్‌సుఖ్‌నగర్ రోజురోజు రగిలిపోతుందని, ప్రభుత్వం నిరుద్యోగులను ఉక్కుపాదంతో అణచివేస్తుందని మండిపడ్డారు.

నిరుద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఓసారి మీరు కూడా దిల్‌సుఖ్‌నగర్‌కు రావాలని కోరారు. ఈ రెండున్నరేళ్లలో నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉన్నామని, తప్పకుండా దిల్‌సుఖ్‌నగర్ కు వస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. తొలి ఏడాదే రెండులక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాట ఇచ్చిన రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు తీరని ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేంద్రం మెడలు వంచి కేసీఆర్ 95 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించారని గుర్తుచేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భర్తీ చేసిన 65 వేల ఉద్యోగాలను కూడా నిస్సిగ్గుగా తమ ఖాతాలో వేసుకునే నీచానికి ఈ ముఖ్యమంత్రి ఒడికట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే 20వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో సతీష్, అంజీ తదితరులు

# ఫీజుల బకాయిల కోసం '8న సత్యాగ్రహ దీక్ష'

## 300 కోట్లు కాదు 8 వేల కోట్లు చెల్లించాలి

### చెల్లించే దాకా ఉద్యమాలు కొనసాగుతాయి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది బిసి, ఓబిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లిం చాలని, పాత విధానం కొనసాగించాలని, జివో నెంబరు 9ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న ఇందిరాపార్కు వద్ద తాను 'సత్యగ్రహ దీక్ష' చేపడుతున్నానని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. తనతో పాటు వేలాది విద్యార్థులు, 18 బిసి సంఘాలు పాల్గొంటాయని చెప్పారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజుల రీయంబర్స్‌మెంట్ కోసం 8 వేల కోట్లు కేటాయించవలసి ఉండగా ప్రభుత్వం కేవలం మొక్కుబడిగా బుధవారం 300 కోట్లు విడుదల చేసి చేసిందని, ఇవి ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. మొత్తం బకాయిలను చెల్లించాలని, చెల్లించేవరకు ఉద్యమాలు కొనసాగుతాయన్నారు. ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో నేనని గుర్తుచేశారు. ప్రమావేశంలో నాయకులు పగిళ్ల సతీస్, జిల్లపల్లి అంజీ, మోదరాందేవ్, జి.కృష్ణయాదవ్, నిఖిల్‌పటేల్, భీంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలపై 'దేశం' కసరత్తు

## – పూతలపట్టు నియోజకవర్గంలో మెజార్టీ పంచాయతీలు ఏకగ్రీవం కోసం 'దేశం' వ్యూహం
## – సర్వశక్తులు ఒడ్డి పోటీకి వైకాపా ప్రయత్నం
## – పొత్తులు, రిజర్వేషన్లతో తమకు అవకాశం రాదని కొందరిలో నిర్లిప్తత

**చిత్తూరు, జులై 2 ప్రభాతవార్త:**
పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్దం అవుతుండటంతో పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో తమ అదృష్టం పరీక్షించుకోవడానికి పార్టీలోని చోటా నాయకులు సిద్దం అవుతున్నారు. పంచాయతీ ఎన్నికలకు త్వరలో ముహుర్తం ఖరారు అయ్యే అవకాశం వుండటంతో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తెలుగుదేశం పార్టీ మద్దతుతో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖరారు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పూతలపట్టు నియోజకవర్గ పరిధిలో మొత్తం 5 మండలాలు వుండగా ఇందులో 152 గ్రామ పంచాయతీలు వున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీ ఎన్నికలు ఏకపక్షంగా జరుగడం, ఆ ఎన్నికల్లో మెజార్టీ గ్రామ పంచాయతీలను వైకాపా మద్దతుదారులు ఏకగ్రీవంగా కైవసం చేసుకోవడంతో ప్రస్తుతం జరుగనున్న పంచాయతీ ఎన్నికల్లో సైతం అదే తరహా ప్రణాళికలు సిద్ధం చేసి పంచాయతీలను తెలుగుదేశం మద్దతుదారులకు కట్టబెట్టడానికి వ్యూహాలు రచిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేయాలని వైకాపా అధిష్టానం నుండి పార్టీ నేతలకు స్పష్టమైన ఆదేశాలు రావడంతో ఎలాగైనా ఎన్నికల్లో పోటీ చేయాలని వైకాపా నాయకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వుండటంతో ఆ పార్టీ మద్దతుదారుడిగా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే ఏకగ్రీవం అయ్యే అవకాశం వుండటంతో ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేయడానికి నాయకులు క్యూ కడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం వుండటంతో పంచాయతీ ఎన్నికల్లో సైతం తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయి. అయితే జిల్లాలో జనసేన, బిజెపి పార్టీలకు క్షేత్ర స్థాయిలో ఆశించిన క్యాడర్ లేకపోవడంతో ఆ పార్టీలు తెలుగుదేశం పార్టీ క్యాడర్‌పై ఆధారపడాల్సి వుంటుంది. అయితే క్షేత్ర స్థాయిలో తమ క్యాడర్ బలంగా వుండి కూటమి భాగస్వామ్య పార్టీలు ఖరారు చేసిన అభ్యర్థుల విజయానికి కృషి చేసే ప్రసక్తే లేదని తెలుగుదేశం నాయకులు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జనసేన, బిజెపి పార్టీలకు కేటాయించిన పంచాయతీల్లో తెలుగుదేశం మద్దతుదారుల నుండి పోటీగా నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం వుండగా, తెలుగుదేశం మద్దతుదారులు పోటీ చేసే పంచాయతీల్లో సైతం ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు పోటీ చేసే అవకాశం వుండటంతో ఈ ఎన్నికల్లో ఏకగ్రీవాలు చేయడం పార్టీ ఎమ్మెల్యేలకు అంత సులభం కాదని పరిశీలకులు భావిస్తున్నారు. బంగారుపాళ్యం మండల పరిధిలో 41 గ్రామ పంచాయతీలు వుండగా ఇక్కడ మాజీ పార్టీ అధ్యక్షులు ఎన్‌పి జయప్రకాష్, పార్టీ అధ్యక్షులు ఎన్‌పి ధరణిల ఆమోదంతో పార్టీ మద్దతుగా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖరారు కానున్నారు. అలాగే తవణంపల్లి మండల పరిధిలో మొత్తం 32 పంచాయతీలు వుండగా ఈ మండలంలో ఒకే కుటుంబంలోని వ్యక్తులు ఇటు తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులుగా, అటు జనసేన మండల పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. పొత్తులో భాగంగా ఈ మండలం నుండి జనసేన ఎక్కువ పంచాయతీలు కోరే అవకాశం వుండగా, ఆ మేరకు ఖరారు చేయడానికి వీలు లేదని తెలుగుదేశం పార్టీ నాయకులు ఇప్పుడే పేర్కొంటున్నారు. ఐరాల మండల పరిధిలో మొత్తం 28 పంచాయతీలు వుండగా పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడానికి పార్టీలోని ఇరు వర్గాలను ఇప్పటి నుండి ఏకం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ సొంత మండలం పూతలపట్టులో 25 గ్రామ పంచాయతీల్లో అత్యధిక స్థానాలను ఏకగ్రీవం చేయడానికి ఎమ్మెల్యే వ్యూహాలు సిద్దం చేసుకుంటున్నారు. అలాగే యాదమరి మండలంలో మొత్తం 26 పంచాయతీలు వుండగా ఇక్కడ ప్రస్తుతం వున్న పార్టీ నాయకత్వంను ధిక్కరించే అవకాశాలు పుష్కలంగా కన్పిస్తున్నాయి. మండల పరిధిలోని మూడు కీలక పంచాయతీల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులకు సొంత పార్టీ నేతల నుండే ముప్పు ఎదురుకానుంది. ఈ పరిస్థితుల్లో ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించిన వైకాపా పంచాయతీ ఎన్నికలపై తెలుగుదేశం పార్టీలో జరుగుతున్న పరిణామాలను పరిశీలించి అడుగులు వేస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరిగితే వైకాపాకు లబ్ది కలిగే అవకాశం పుష్కలంగా కన్పిస్తున్నది.

# తిరుపతి డివిజన్

## ఎమ్మెల్యే పులివర్తి నానిపై ఆరోపణలు మానుకోవాలి
: బిజెపి మండలాధ్యక్షుడు కిషోర్ రాయల్



**చిన్నగొట్టిగల్లు, జూలై 2 ప్రభాతవార్త :**
చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై కొందరు వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని బిజెపి మండల అధ్యక్షుడు కిషోర్ రాయల్ ఖండించారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక, ప్రజల్లో ఎమ్మెల్యేకు పెరుగుతున్న ఆదరణను చూసి అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ఎమ్మెల్యే పులివర్తి నాని లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశంతో నిరాధార ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. . అలాగే కాంగ్రెస్ నాయకుడు లోకేష్ రెడ్డితో జరిగిన ఫోన్ సంభాషణను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు మునికుమార్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు

## పేద విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పించాలి
ఎస్వీడబ్ల్యూ, ఎస్వీ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు వినతి



**తిరుపతి విద్య జూలై 2 ప్రభాత వార్త**
ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని టీటీడీ ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాల, ఎస్వీ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు వెంటనే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని విద్యార్థి, దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన అనేక మంది పేద విద్యార్థులు వివిధ కారణాలతో ఇప్పటికీ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు పొందలేకపోయారని నాయకులు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. టీటీడీ ఎస్వీడబ్ల్యూ, ఎస్వీ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు తక్షణమే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించి, అర్హులైన పేద విద్యార్థులకు అవకాశం కల్పించాలని వారు కోరారు. విద్య ప్రతి విద్యార్థి హక్కు అని, ప్రవేశాల లేమితో ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సానుకూలంగా పరిశీలిస్తామని ప్రిన్సిపాళ్లు హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో నేషనల్ ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ రాపూరి ప్రసాద్ బాబు, మాదిగ జనసైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాకర్ మాదిగ, భారతీయ దళిత విద్యార్థి సేన నాయకుడు యుగంధర్, మాల విద్యార్థి సంఘం నాయకుడు సుకుమార్ మాల, అఖిల భారత అంబేద్కర్ సేన నాయకుడు ప్రభు, వాల్మీకి విద్యార్థి సంఘం అధ్యక్షురాలు వినూత, నేషనల్ అంబేద్కర్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, తేజా తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు,కేంద్ర మంత్రిని సత్కరించిన డా. పి. సి. రాయులు
**తిరుపతి విద్య జూలై 2 ప్రభాత వార్త**



ఎయిర్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యులు, దక్షి ణ మధ్య రైల్వే జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు, అలాగే భారత ప్రభుత్వ పోర్టులు,షిప్పింగ్,జలమార్గాలు, పర్యాటక , సాంస్కృతిక శాఖలతో అనుబంధంగా సేవలందిస్తున్న డా. పి. సి. రాయులు గురువారం తిరుపతి విమానాశ్రయంలో పర్యటించిన పలువురు దేశ, రాష్ట్ర అగ్రగణ్యులను సాదరంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి తిరుపతి ఎయిర్‌పోర్టులో డా. పి. సి. రాయులు ఘనస్వాగతం పలికి, శాలువాతో ఆత్మీయంగా సన్మానించారు. అదేవిధంగా తిరుపతి విచ్చేసిన భారత ప్రభుత్వ జౌళి శాఖ కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ని, ఒడిశా గౌరవ రాష్ట్ర గవర్నర్ డా. కంభంపాటి హరిబాబు ని కూడా డా. రాయులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డా. పి. సి. రాయులు విలేకరులతో మాట్లాడుతూ, దేశం, రాష్ట్ర ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఇటువంటి ప్రముఖ నాయకులను సత్కరించడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మౌలిక వసతులు, విమానయానం, రైల్వేలు, పోర్టులు, పర్యాటకం , ప్రజా సంక్షేమ రంగాలు రాబోయే రోజుల్లో మరింత అద్భుతంగా అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షి ంచారు. ఎంతో ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖులంతా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## రొంపిచర్లలో విబిజి రాంజీ కార్యక్రమానికి శ్రీకారం
**రొంపిచర్ల, జూలై 2, ప్రభాతవార్త**



గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపా యాల కల్పనతో పాటు శ్రామికులకు ఉపాధి అవకాశాలు పెంచడమే వి.బి.జి రాంజీ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా బాబు రెడ్డి తెలిపారు. గురువారం రొంపిచర్ల మండలం చల్లావారిపల్లి గ్రామంలో విబిజి రాంజీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే అభివృద్ధి పనులను విబిజి రాంజీ ద్వారా కూడా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా పండ్ల తోటల అభివృద్ధి, భూసార పరిరక్షణ, జల సంరక్షణ, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి మెరుగుదలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ సహదేవ, ఏఎంసీ డైరెక్టర్లు జెట్టి ఈశ్వరయ్య, బండి సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి హరి, గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు, విబిజి రాంజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలసిన ఎమ్మెల్యే ఆదిమూలం
**కేవీబీ పురం, జూలై 2 ప్రభాతవార్త:**



సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీ లో హీరో గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0 భూమి పూజ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కలశారు. సత్యవేడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉమ్మడి జిల్లా జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్, తదితరులు ఉన్నారు.

## వృద్ధ దంపతుల భూమి కబ్జాపై మొదట నుండి పోరాడుతున్నది కాంగ్రెస్ పార్టీ
– చంద్రగిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఐరాల లోకేష్ రెడ్డి

**తిరుపతి హెల్త్, జూలై 2, ప్రభాతవార్త**



తిరుపతి రూరల్ అవిలాల పంచాయతీలో వృద్ధ దంపతుల భూమి కబ్జాపై మొదట నుండి పోరాడుతున్నది కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు నిజాలు తెలుసుకొని అందరూ మద్దతు తెలుపుతున్నారని చంద్రగిరి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ ఐరాల లోకేష్ రెడ్డి అన్నారు. లోకేష్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే నాని మొదట నాకు ఫోన్ చేసి నిజాలు తెలుసుకుని రికార్డు పరిశీలించి మాట్లాడాలని కోరగా, రిటైర్డ్ జడ్జి గుర్రప్ప నాయుడు వద్దకి వెళ్లి రికార్డులన్నీ పరిశీలించాక ఎమ్మెల్యేకి ఫోన్ చేశారని అన్నారు. ఎమ్మెల్యే మాట తీరు అభ్యంతరంగా, నన్ను శాసించే విధంగా మాట్లాడుతున్నందువల్లే రికార్డు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తనను బ్లాక్ మెయిల్ చేసే విధంగా రాజకీయాలు చేస్తున్నాడని, నిజా నిజాలు చంద్రగిరి ప్రజలకు తెలియాలనే రికార్డు చేశానని లోకేష్ రెడ్డి చెప్పారు. మాట్లాడిన రికార్డింగ్‌లో కట్ చేశారన్నారు కదా! మాట్లాడింది మీరు కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు సంవత్సరాలు ఓర్పుగా ఉన్నానని, మీ అవినీతి, అక్రమాలు ఎక్కువైనందు వల్లనే ప్రశ్నిస్తే వేరే వాళ్లతో రంకు అంటగడతావా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తనను తాను కాపాడుకోవడానికి చెవిరెడ్డిని తెరపైకి తెచ్చారని, మధ్యలో చెవిరెడ్డి, పురుషోత్తం నాయుడు, ప్రస్తావన ఎందుకు వచ్చిందన్నారు. తను చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఇతరులపై తన అకస్సు వెలగకుతున్నారని ఆరోపించారు. చంద్రగిరిలో అవినీతి ఎక్కడ జరిగితే అక్కడ కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నారు. మీ సామాజిక వర్గమే నీ మాటలను విశ్వసించ లేదన్నారు. ముఖ్యమంత్రి పుట్టిన నియోజకవర్గంలో నీకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే, మీ అవినీతి, అక్రమాలతో నారా చంద్రబాబు నాయుడుకి, లోకేష్‌కి చెడ్డపేరు తేస్తున్నారని అన్నారు. చంద్రగిరిలో ఒకరు దోచుకున్న వారు అయితే, మరొకరు దోస్తున్న వారని, ఇద్దరి పాలను చూశారని కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని చంద్రగిరి ప్రజలకు లోకేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నాకు సంబంధించిన వ్యక్తుల ద్వారా భయపెట్టే కార్యక్రమాలు చంద్రగిరి ఎమ్మెల్యే చేస్తున్నాడని, ఎటువంటి దాడులు కైనా కేసులుకైనా భయపడే ప్రసక్తి లేదని లోకేష్ రెడ్డి స్పష్టం చేశారు. రామచంద్రాపురం గుట్టకు గుండు కొట్టారని, నెల్లూరు మిట్ట కండ్రిగ రోడ్డు సంబంధించి 100 ఎకరాలు టీడీపీ కార్యకర్తలు దోచుకున్నారని, ఆరోపించారు.

## స్విమ్స్ టిటిడి ప్రాణదాన పథకం క్రింద 261 మంది పేదరోగుల ఎంపిక



**తిరుపతి హెల్త్, జూలై 2, ప్రభాతవార్త**
శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో గురువారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం కమిటి హాల్ నందు స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్. వి. కుమార్ అధ్యక్షతన జరిగింది. శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయలయ డైరెక్టర్ డా. శ్రీనాథ్ రెడ్డి, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, ఆర్. ఎం. ఓ. డా కోటిరెడ్డి, బర్డ్ హాస్పిటల్ ఆర్. ఎం. ఓ. డా. రామూర్తి, టిటిడి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. కుసుమకుమారి, రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సుబ్బలక్ష్మి, మెటర్నటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. శ్రీనివాసులు, స్విమ్స్‌కు చెందిన సంబంధిత విభాగాధిపతులు డాక్టర్లు, సిబ్బంది పాల్గొని 261 మంది పేద రోగులను ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయడం జరిగింది. పేషంట్ల యొక్క ఆరోగ్య స్థితిగతులను, బియ్యం కార్డు కలిగి దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న నిరుపేదలను వారి అర్హతలను బట్టి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడానికి వివిధ విభాగాల క్రింద ఎంపిక చేయడం జరిగింది. కార్డియాలజి 08, కార్డియో థొరాసిక్ 25, జనరల్ సర్జరి 14, మెడిసిన్ 16, నెప్రాలజి76, న్యూరాలజి 09, న్యూరో సర్జరీ 45, గైనకాలజి 04, రేడియాలజీ 01, రేడియేషన్ ఆంకాలజీ 04, గ్యాస్ట్రో ఎంట్రాలజీ 48, సర్జికల్ ఆంకాలజీ 10, యురాలజీ 01 మొత్తం 261 మంది పేషెంట్లను ఎంపిక చేయడం జరిగింది. పేద రోగులకు ప్రాణదానం క్రింద ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడానికి ఆర్థిక సహాయం చేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యానికి ఈ సందర్భంగా పేషంట్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి చేయూతనిచ్చే టిటిడి ప్రాణదాన పథకానికి దాతలు, సంస్థలు సహృదయంతో ముందుకు వచ్చి విరివిగా విరాళాలు అందించలన్నారు.

## గురువు బాటలోనే శిష్యుడు
ఆంధ్ర స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో చేరిన గార్లపాటి శ్రీధర్

**తిరుపతి విద్య, జూలై 2 ప్రభాత వార్త**



తిరుపతి జిల్లా విద్యార్థి రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. ఏపీ స్టూడెంట్స్ జేఏసీకి రాజీనామా చేసిన తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్.. తన రాజకీయ గురువు బాటలోనే నడవాలని నిర్ణయించుకున్నారు. గతంలో హేమాద్రి యాదవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో శ్రీధర్ ఆయన కింద తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పాటు సేవలందించారు. ఇటీవలే ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నుండి బయటకు వచ్చిన ఎం. హేమాద్రి యాదవ్ నూతనంగా ఆంధ్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ ను స్థాపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన గురువు ఆశయాల సాధన కోసం గార్లపాటి శ్రీధర్ కూడా జేఏసీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి గుడ్‌బై చెప్పి, ప్రస్తుతం హేమాద్రి యాదవ్ సమక్షంలో ఆంధ్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ లో సాధారణ సభ్యుడిగా చేరారు. ఈ సందర్భంగా గార్లపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. హేమాద్రి యాదవ్ నాయకత్వంలోనే విద్యార్థులకు నిజమైన న్యాయం జరుగుతుందని, ఆయన చూపిన బాటలోనే నడుస్తూ నూతన ఫెడరేషన్ బలోపేతానికి, విద్యార్థి లోకపు సమస్యల పరిష్కారానికి ఒక సాధారణ కార్యకర్తలా శ్రమిస్తానని స్పష్టం చేశారు. జేఏసీకి చెందిన ఇద్దరు కీలక నేతలు ఇప్పుడు సరికొత్త ఫెడరేషన్ ద్వారా రంగంలోకి దిగడంతో తిరుపతి జిల్లా విద్యార్థి రాజకీయం ఒక్కసారిగా ఆసక్తికరంగా మారింది.

## వి బి జి రాంజీ పథకంతో ఉపాధి కూలీలకు లబ్ది
మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

**శాంతిపురం, జూలై 2 ప్రభాతవార్త**



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వి బి జి రామ్ జి పథకంతో ఉపాధి కూలీలకు ఎంతో లబ్ది కలుగుతుందని మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కెనమాకులపల్లి గ్రామంలో ఆయన టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్ తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 312 రూపాయల గిట్టుబాటు కూలి ఈ పథకం ద్వారా లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏపీ ఆర్ కుమార్, శివ ,రమేష్ ,నాగరాజు పాల్గొన్నారు అలాగే రాళ్ళ బూదుగూరు లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనిట్ ఇంచార్జ్ మణి, రెస్కో డైరెక్టర్ బసవరాజు, జయరా జూ, పంచాయతీ కార్యదర్శి శివశంకర్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రికి ఘన స్వాగతం
రేణిగుంట జూలై 2 ప్రభాతవార్త



తిరుపతి (రేణిగుంట) అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు గురువారం అపూర్వ స్వాగతం లభించింది. కోడూరు మండలం ముక్కా వారి పల్లె లో జరిగే జాతీయ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయనకు విమానాశ్రయంలో రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ వెంకటరత్నం, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు రాము కుమార్, అనిల్ కుమార్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. రైతులకు, ప్రజలకు వివిధ ప్రాజెక్టుల ద్వారా అందిస్తున్న సేవలను కేంద్రమంత్రికి వివరించారు.

# శాస్త్రీయ పద్ధతుల్లో కోళ్ళ పెంపకంతోనే అధిక లాభాలు

## డీన్ డాక్టర్ ఆర్.వీ .సురేష్ కుమార్



**తిరుపతి విద్య, జూలై 2 ప్రభాతవార్త**
శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని నిరంతర పశువైద్య విద్య మరియు సమాచార కేంద్రం ఆధ్వర్యంలో వ్యాపార సరళిలో కోళ్ళు మరియు కంజు పిట్టలు పెంపకం అనే అంశంపై మూడు రోజుల ఎంట్రప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. జూలై 2 నుండి 4వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుండి 48 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, రైతులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెటరినరీ సైన్స్ డీన్ డాక్టర్ ఆర్ .వీ . సురేష్ కుమార్ శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. కోళ్ళ పెంపకాన్ని మొదట చిన్న పరిశ్రమగా ప్రారంభించి, అనుభవం సాధించిన తర్వాత పెద్ద ఎత్తున విస్తరించాలన్నారు. తద్వారా పదిమందికి ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని పిలుపునిచ్చారు. కార్యక్రమ సభాధ్యక్షురాలైన పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతుల్లో కోళ్ళను పెంచడం ద్వారా వ్యాధులు, మరణాల శాతాన్ని అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం సి సి వీ ఈ సి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సుబాల్ మాట్లాడుతూ.. కుటుంబ సహకారంతో, ఆధునిక సాంకేతికతను జోడించి కోళ్ళ పెంపకం చేపడితే తక్కువ సమయంలోనే ఎక్కువ బరువు, అధిక గుడ్ల ఉత్పత్తి సాధించి మంచి లాభాలు పొందవచ్చని సూచించారు. ఈ శిక్షణలో పశువైద్య కళాశాల కోళ్ళ విభాగాధిపతి డాక్టర్ ఎస్ . షకీలా, డాక్టర్ తిరుపతి రెడ్డి, డాక్టర్ ఎస్ . వేణుగోపాల్, డాక్టర్ పి. మంజుల, డాక్టర్ రెడ్డి వరప్రసాద్ తదితరులు సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్‌లుగా పాల్గొని రైతులకు విలువైన సూచనలు చేశారు.

# వికసిత్ భారత్ లక్ష్యం కోసం సమిష్టి కృషి అవసరం : ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, జూలై 2 ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ 2047 నెరవేరాలంటే సమిష్టి కృషి అవసరమని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం మండల పరిధిలోని సామంత మల్లం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ నూతన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని) ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడం, కుటుంబాల జీవనోపాధిని బలోపేతం చేయడం, గ్రామాల్లో శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా గ్రామీణ కార్మికులకు సంవత్సరానికి 125 రోజుల ఉపాధిని కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల ప్రకారం కూలీలకు పారదర్శకంగా చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. మెట్రిక్ హాజరు, జియో ట్యాగింగ్ వంటి ఆధునిక సాంకేతిక విధానాల ద్వారా పనులు నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా వేతనాలు చెల్లింపులు నిర్ణీత గడువులో చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పథకం కేవలం ఉపాధి కల్పనకే కాకుండా గ్రామాల్లో చెరువులు, కాలువలు, రోడ్లు, పచ్చదనం పెంపు, ప్రజలకు ఉపయోగ పడే శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాకం వెంకట సుబ్బయ్య, జక్కల బాలయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# వెంకటగిరి-కోడూరు రోడ్డును నిర్మిస్తాం

-హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు



వెంకటగిరి, జూలై 2 ప్రభాతవార్త : వెంకటగిరి-కోడూరు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కోడూరు మండలంలో జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు నాయుడు వెంకటగిరి -కోడూరు రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి వెంకటగిరి–కోడూరు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. వెంకటగిరి పట్టణం నుండి వెలుగొండ కొండల వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డును నిర్మించారు. అప్పటి కడప జిల్లా చిట్వేలు నుండి వెలుగొండ అడవుల వరకు రోడ్డును వేశారు. అటవీశాఖ అనుమతులు లేక 22 కిలోమీటర్ల దూరం రోడ్డు వేయలేదు. 1991వ సంవత్సరంలో అప్పటి సీఎం జనార్ధన్‌రెడ్డి కడప నెల్లూరు జిల్లాలకు తక్కువ దూరం వెళ్లేందుకు ఈ రోడ్డును వేయించేందుకు ప్రయత్నాలు చేశారు. 35 సంవత్సరాలుగా రోడ్డు నిర్మాణ పనులు ఆగి ఉన్నాయి. అయితే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రోడ్డు నిర్మించాలని సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. అటవీశాఖ అనుమతులు తెప్పించి వెంకటగిరి–కోడూరు రోడ్డు నిర్మిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. 22 కిలోమీటర్ల దూరంలో ఈ రోడ్డును త్వరలో నిర్మిస్తామని ప్రకటించారు. వెంకటగిరి కోడూరు రోడ్డుకు మోక్షం కలగడంతో కడప నెల్లూరు జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రచారం



తడ,జూలై 2 ప్రభాతవార్త: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తడ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మెగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు తడ మండలం ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు యుటిఎఫ్ సభ్యులుగా 102 మంది ఉపాధ్యాయులు సభ్యత్వం నమోదు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో తడ యుటిఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, రామమూర్తి, సుధాకర్, రాంబాబు, నవీన్ కుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## చదివిన ఆర్థికశాస్త్రం కంటే ...సమాజమే ఎక్కువ నేర్పింది

-ప్రజల జీవితాల్లో మార్పే అభివృద్ధికి కొలమానం




తిరుపతి,జులై 2ప్రభాతవార్తప్రతినిధి: తాను ఆర్థిక శాస్త్రం చదివినా, పుస్తకాల కంటే సమాజం, ప్రజల నుండే ఎక్కువ నేర్చుకున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆర్థిక వృద్ధి గణాంకాలు పెరగడం మాత్రమే గొప్పదనం కాదు, ఆ వృద్ధి పేదల జీవితాల్లో ఎంత మార్పు తీసుకొస్తోందన్నదే ప్రభుత్వానికి అసలైన కొలమానమని స్పష్టం చేశారు. జీఎస్‌డీపీ సీపీఐజీఆర్ వంటి ఆర్థిక సూచికలను విశ్లేషిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా పాలన సాగిస్తున్నామని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ పేరుతో జరిగిన రాష్ట్రస్థాయి రెండు రోజుల వర్క్‌షాప్‌లో గురువారం చంద్రబాబు పాల్గొన్నారు. డేటా ఆధారిత పాలన, సాంకేతికత, సమర్థవంతమైన పరిపాలన ద్వారానే రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దగలమని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా విజన్2020 రూపొందించినప్పుడు విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి పనిచేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం డేటానే సంపదగా మారిందని, భవిష్యత్‌లో డేటా ఆధారిత నిర్ణయాలకే అత్యధిక ప్రాధాన్యం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందించడం ఎంత ముఖ్యమో, రాష్ట్రంలో సంపద సృష్టించేందుకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం కూడా అంతే కీలకమన్నారు. అందుకే స్వర్ణాంధ్ర2047 విజన్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు ప్రధాన అంశంగా చేరుస్తున్నామని తెలిపారు. అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా అనుసంధానం చేయడానికి డేటా లేక్ రూపొందిస్తున్నామని, ప్రభుత్వ శాఖలన్నింటి డేటాను ఒకే వేదికపైకి తీసుకొస్తున్నామని వివరించారు. ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు హెల్త్ రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేసి సంజీవని ప్రాజెక్టు అమలుకు కార్యాచరణ రూపొందించామని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమేనని సీఎం స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలనకు కేవలం గణాంకాలు సరిపోవని, ప్రతి కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా ఎదగాల్సిందేనని పేర్కొన్నారు. అనంతరం సభికులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ తాను త్వరగా సంతృప్తి చెందే వ్యక్తిని కాదన్నారు. సంతృప్తి చెందితే అదే స్థితిలో ఆగిపోతామని, అందుకే ప్రజల కోసం నిరంతరం కొత్త విధానాలను అన్వేషిస్తూ ముందుకు సాగాలని సూచించారు. కేంద్ర స్టాటస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ శాఖ కార్యదర్శి డాక్టర్ సౌరభ్ గార్గ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ ఆర్. బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ కె.వి. రాజు, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ లతో కూడిన ప్యానెల్ డిస్కషన్ను ముఖ్యమంత్రి తిలకించారు. సభికుల మధ్యే కూర్చొని ప్యానెల్ చర్చను సిఎం ఆసక్తిగా ఆలకించారు.

## ఉపముఖ్యమంత్రికి ఘన స్వాగతం



రేణిగుంట జూలై 2 ప్రభాతవార్త: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం లభించింది. తిరుపతి జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి ప్రత్యేక విమానంలో గురువారం రేణిగుంట చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, కోడూరి ఎమ్మెల్యే శ్రీధర్, జనసేన పార్టీ అధికార ప్రతినిధి హ్యాండ్ క్రాఫ్ట్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, శ్రీకాళహస్తి గుడి ఛైర్మన్ కొట్టేసాయి, అడిషనల్ ఎస్పీ శ్రీలత, రేణిగుంట తహసిల్దార్ శ్రవణ్, తదితరులు ఉన్నారు. కార్యక్రమాలు ముగించుకొని ఆయన ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్లారు.

## ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం

రేణిగుంట, జూలై 2 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా గురువారం ఘనంగా స్వాగతం లభించింది. ప్రత్యేక విమానంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో తిరుపతి ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షురాలు మాజీ మంత్రి పనబాక లక్ష్మి, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, శ్రీకాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్‌రెడ్డి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం ద్వితీయ తృతీయ శ్రేణి నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికారు.

## వీబీ జీ రామ్ జీ పథకంతో పేదలకు ఆర్థిక భద్రత

- ఎస్ఆర్ పురం మండలంలో పథకంను ప్రారంభించిన ఎంపీ దగ్గుమళ్ళ



చిత్తూరు, జులై 3 ప్రభాతవార్త: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(వీబీ జీ రామ్ జీ) పథకం గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు, కూలీలకు ఆర్థిక భద్రత కల్పిస్తోందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. జిడినెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం క్షీరసముద్రం గ్రామంలో గురువారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు వీబీ జీ రామ్ జీ పథకంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు క్షీర సముద్రం గ్రామానికి చెందిన చెరువు కట్ట నిర్మాణంకు భూమి పూజ చేశారు. అలాగే జీఎంఆర్ పురం కాజ్‌వే నిర్మాణ పనులను సత్వరం ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఎంపీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉపాధి పథకం కింద చేపడుతున్న పనులు ప్రజలకు అందుబాటులో వున్నాయా! పనుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు వచ్చిన సత్వరం తన దృష్టికి తీసుకురావాలని, ఈ విషయంపై సత్వరం స్పందించి సమస్యను పరిష్కరిస్తానని ఎంపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిధులు విడుదల అవుతాయన్నారు. పారదర్శకత కోసం డిజిటల్ పేమెంట్స్ ద్వారా వేతనాలు నేరుగా కూలీల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. వ్యవసాయంకు అనుకూలంగా విత్తనాలు, పంటల కోతల సమయాల్లో వ్యవసాయ కూలీల కొరత రాకుండా పని లేని కాలంను కూడా కూటమి ప్రభుత్వం ప్లాన్ చేసిందన్నారు. గ్రామీణ మౌళిక వసతులు, నీటి భద్రత, జీవనోపాధి వనరులు, ఆస్తుల సృష్టి ద్వారా గ్రామీణాభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. ఈ పథకంను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.డ్వామా పిడి రవికుమార్, ఎంపిడిఓ వనజ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్‌నాయుడు, మాజీ దేశం జిల్లా కార్యదర్శి గంధమనేని రాజశేఖర్‌నాయుడు, ఆరిమాను గంగమ్మ దేవాలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ గుండాల జలేంద్రనాయుడు, సింగిల్‌విండో అధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, గంగమ్మ ఆలయ వైస్ ఛైర్మన్ వెంకట రామయ్య, కూటమి నాయకులు రామకృష్ణ యాదవ్, మాధవరెడ్డి, రవినాయుడు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన...
## ముక్కా వరలక్ష్మి అనిత దీప్తులు



ఓబులవారిపల్లి, జూలై 2 ప్రభాతవార్త: ఓబులవారిపల్లి మండలం ముక్కావారిపల్లి మరియు మంగంపేట గ్రామ పరిధిలో ఏర్పాటుచేసిన వి బి జి రామ్ జి పథకం మహాసభలో గురువారం సీఎం చంద్రబాబు నాయుడు అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్రమంత్రి శివాజీ సింగ్ చౌహాన్ ప్రసంగిస్తున్న సమయంలో టిడిపి ఇంచార్జ్ ముక్కారూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి, రాష్ట్ర టిడిపి ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనిత దీప్తి మరి కొంతమంది మహిళలు ఆనందానికి హద్దులు లేవనే చెప్పవచ్చు. సభలో ప్రతి ప్రసంగానికి యువత కొడుతున్న చప్పట్లు వారు చేస్తున్న కేరింతలు చూసి వారు ఆనందంతో ఉప్పొంగిపోయారు. ప్రతిసారి సీఎం చంద్రబాబు మాట్లాడే సమయంలో వారు వి ఆకారంలో రెండు చేతి వేళ్ళు చూపెడుతూ హర్షద్వానాలు చేస్తూ చప్పట్లు కొడుతూ మహా ఆనందం పొందారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధిక సంఖ్యలో యువతులు, యువకులు, పెద్దలు, కూటమి నాయకులు కార్యకర్తలు వేల సంఖ్యలో హాజరయ్యారు.

## సంస్కృత వర్శిటీలో కీలక నియామకాలు

తిరుపతి విద్య, జూలై 2 ప్రభాతవార్త: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యా, పరిశోధనా కార్యకలాపాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిపాలనా మార్పులు చోటుచేసుకున్నాయి. విశ్వవిద్యాలయంలోని వివిధ స్కూల్స్‌కు కొత్త డీన్లను, పలు విభాగాలకు విభాగాధిపతులను నియమిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ- 2020) అమలు, పరిశోధనల విస్తరణ, సంస్కృత భాషాభివృద్ధి లక్ష్యంగా ఈ నియామకాలు చేపట్టినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి.వైస్‌చాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి మార్గదర్శకత్వంలో రిజిస్ట్రార్ కె. వెంకట నారాయణరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ప్రొ. ఆర్.జె. రమాశ్రీని నూతనంగా ఏర్పాటు చేసిన స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సైన్స్ డీన్‌గా నియమించారు. అద్వైత వేదాంత విభాగానికి చెందిన ప్రొ. కె.గణపతి భట్‌కు స్కూల్ ఆఫ్ దర్శనాస్ డీన్ బాధ్యతలు అప్పగించగా, సాహిత్య విభాగానికి చెందిన ప్రొ. సి. రంగనాథన్‌ను స్కూల్ ఆఫ్ సాహిత్య సంస్కృతి డీన్‌గా నియమించారు.పరిశోధన, ప్రచురణల విభాగానికి చెందిన ప్రొ. రాజేష్ మీనాకు రీసెర్చ్ అండ్ పబ్లికేషన్స్ విభాగాధిపతి బాధ్యతలు అప్పగించారు. మేథమేటిక్స్ విభాగానికి చెందిన డా. ఎ. చందూలాల్‌ను మేథమేటిక్స్ విభాగాధిపతిగా నియమించారు.

# వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంభాభిషేకం



శ్రీకాళహస్తి జూలై 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని బజారువీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న ద్వితీయ ద్వాదశ మహాకుంభాభిషేకం కార్యక్రమాలు ఉదయం గణపతి పూజలతో శ్రీకారం చుట్టారు. మూడు రోజుల పాటు సాగిన పూజలు గురువారం కలశానికి అభిషేకంతో ముగిసాయి. ఆలయంలోని అమ్మవారి మూల విరాట్టు ఎదురుగా కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఆలయం శిఖర గోపురంపై ప్రతిష్టించి, అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకించారు. 1997లో నిర్మించిన ఆలయంలో రెండవ సారి మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నారు. సంఘాధ్యక్షుడు జూలుగంటి మురళి పర్యవేక్షణలో రూ.20లక్షల బడ్జెట్‌తో కుంభాభిషేకం కార్యక్రమాలను చేపట్టారు. వారం రోజులుగా యువ కమిటి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ఉదయం గణపతి పూజలను నిర్వహించిన అర్చకులు తరువాత శాంతి హోమాలను నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రవేశం,యాగమండప ప్రవేశం, వేదపారాయణ, పంచసూక్తి పారాయణ, నవగ్రహ జపం,అమ్మవారి నక్షత్ర జపం, అమ్మవారిమూల మంత్ర జపం,యాగ కలశ పూజా కార్యక్రమాలు లక్ష్మీగణపతి హోమం, షోడష గణపతి హోమం, సుబ్రమణ్య పంచలోక పాలక, పంచసూక్తి మూల మంత్ర హోమాలు,యుక్త హోమం, దీక్షా హోమం, 116 గోత్ర పూజలు, హోమాలు, ధనపూజ, లఘు పూర్ణాహుతి కార్యాక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలను బ్రహ్మశ్రీ ఇందుకుమార్ శర్మ సారథ్యంలో నిర్వహిస్తున్నారు.మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలలో పలువురు ఆర్యవైశ్యులు అతిధ్యం ఇస్తున్నారు. ఈ నేపధ్యంలో బుధవారం జూలుగంటి రవికుమార్, జగదీష్ కుటుంబసభ్యులు జూలుగంటి శ్రీధర్,రేవంత్ బాబు, కుటుంబ సభ్యులు లలితమ్మ,మహీధర్,పొట్టి ప్రసాద్, మణికంఠ కుటుంబసభ్యులు అల్పాహార,భోజన సదుపాయం కల్పించారు. కుంభాభిషేకం అనంతరం ఆడపడచులకు వడిబాల అందించారు. విరాళాలు ఇచ్చిన దాతలను ఆలయమర్యాదలతో సత్కరించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## సరి కొత్తగా ఉపాధి హామీ పథకం



చిట్టమూరు, జూలై 2 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సరికొత్తగా వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అవిజిక మిషన్‌గా పేరు మార్చారు. ఇందులో భాగంగా 100 దినాలు ఉన్న కూలీల పని దినాలను 125 రోజులకు పెంచడంతోపాటు ప్రతి 15 రోజులకు ఒకసారి కూలీలకు వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో వారికి నష్టపరిహారం అందజేయాలన్నది ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. గతంలో ఎంజిఎన్ ఆర్ఎస్ కింద 90 శాతం కేంద్ర ప్రభుత్వం 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులతో పనులు జరిగేవని ప్రస్తుతం 60 శాతం కేంద్ర ప్రభుత్వం 40 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ పథకం రూపాంతరం చెందిందన్నారు. పంచాయతీలో నాయకులు గ్రామస్తులు గుర్తించిన పనులకు ప్రాధాన్యత ను ఇవ్వడంతో పాటు అందరినీ ఈ కార్యక్రమంలో సమన్వయం చేసుకోవాలన్నారు. మండల బీసీ సెల్ అధ్యక్షులు, తెలుగుదేశం నేత కాపులూరు ఎల్లసిరి చెరువులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి కూలీలందరకు న్యాయం జరిగాలా చూడాలని అధికారులను కోరారు. కృష్ణవేణి, నాయకులు వాటంబెటి వెంకటేశ్వర్లు, డీలర్ రామయ్య, జాన్ ఉన్నారు.

## జిరామ్‌జి కార్యక్రమం ప్రారంభోత్సవం



వాకాడు, జూలై 2 ప్రభాతవార్త: వాకాడు మండలం కొండూరు గ్రామంలోని గురువారం వికాసిత్ భారత్ గ్యారంటీ గ్రామీణ పథకంను టిడిపి మండల కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు మేరకు ఉపాధి కూలీలకు రోజువారి పనులు జరిగేలా చూడాలని, కనీస వేతనం అందేలా జరగాలని ఆయన విబిజి రామ్‌జి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో శ్రీనివాసులు, ఏపీవో విజయ, సిబ్బంది, ఉపాధి కూలీలు తదితరులు ఉన్నారు.

## సర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలి : నేదురుమల్లి



వెంకటగిరి, జూలై 2 ప్రభాతవార్త: సర్ కార్యక్రమం పై వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్ జేఆర్ భవనంలో పార్టీ నాయకులు కార్యకర్తలతో సర్ సమావేశం నిర్వహించారు. భోగస్ ఓటర్లు ఉంటే తొలగించాలని తెలిపారు. బిఎల్ఏలు ఇంటింటికి వెళ్లి దరఖాస్తు ఫారాలను అందించి ఇంటిలోనే ఓటర్ల వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. సమయం లేనందున సర్ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్ప లతరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్లు ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నాయకులు దశరథ రామ్ రెడ్డి, సతీష్, సిపిఎల్ నరసింహారావు, రాజారెడ్డి, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాసులు రెడ్డి, పూజారి లక్ష్మి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్

బాలాయపల్లి, జూలై 2 ప్రభాతవార్త: మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఈనెల మూడో తేదీ శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు రాయి సత్యం నాయుడు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎమ్మెల్యే రామకృష్ణ మండల ప్రజల నుండి సమస్యలపై వినతి పత్రాలు స్వీకరిస్తారు అని చెప్పారు. మండల స్థాయి అధికారులు అందరూ ప్రజాదర్బార్‌లో పాల్గొని పలు సమస్యలను పరిష్కరిస్తారు అని తెలిపారు. మండలంలో ఉన్న సమస్యలను ప్రజలు వినతి పత్రాలు రూపంలో ఎమ్మెల్యే రామకృష్ణకు అందజేయాలని చెప్పారు.

## విబిజిరాంజీ పథకం పేదలకు వరం: ఎంపీపీ




వెంకటగిరి, జూలై 2 ప్రభాతవార్త: విబిజి రాంజీ పథకం పేదలకు వరం లాంటిదని ఎంపీపీ తంబి తనుజ రెడ్డి తెలిపారు. మండలంలో విబిజి రాంజీ పథకాన్ని ఆమె ప్రారంభించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రామికులందరికీ పని కల్పించాలని ఈ పథకాన్ని కొత్త రూపంలో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో ఉన్న శ్రామికులందరికీ పని కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 125 రోజులు పని కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు సిబ్బంది పాల్గొన్నారు.

## లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్సీ కళ్యాణ్



వెంకటగిరి, జూలై 2 ప్రభాతవార్త: రాష్ట్ర ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి లోకేష్ పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు జిల్లాకు రావడంతో ఎమ్మెల్సీ కలిసి శాలువాతో సత్కరించారు. పలు అంశాలను మంత్రి దృష్టికి ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి తీసుకొని వెళ్లారు.

## ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం : ఎంపీడీవో



బాలాయపల్లి, జూలై 2 ప్రభాతవార్త: శ్రామికులందరికీ ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో నారాయణ తెలిపారు. మండల కేంద్రమైన బాలాయపల్లి స్త్రీశక్తి కార్యాలయంలో విబిజీ రాంజీ పథకాన్ని మండల అధికారులు ప్రారంభించారు. సీఎం చంద్రబాబు నాయుడు తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో దేశవ్యాప్తంగా అమలు అయ్యే విబిజీ రాంజీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించగా ఆ పథకాన్ని బాలాయపల్లి ఎంపీడీవో నారాయణ, ఏపీవో జ్యోతి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడు, ఉపాధి హామీ పథకం కూలీలు డిజిటల్ పద్ధతులో ఏర్పాటు చేసిన తెరపై వీక్షించారు. ముందుగా సీఎం చంద్రబాబు నాయుడు రైల్వే కోడూరులో ప్రారంభించిన విబిజీ రాంజీ పథకాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని మండలస్థాయి అధికారులు, ఉపాధి హామీ పథకం కూలీలతో కలసి వీక్షించారు. కేంద్రం నుంచి రూ.7700 కోట్లు, రాష్ట్రం నుంచి రూ. 4000 కోట్లు ఈ పథకం పనులు చేపడుతున్నట్లు ఎంపీడీవో వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామంలో విప్లవాత్మకం మార్పులు వస్తాయని, పల్లెల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని అన్నారు. యువత శక్తి సామర్థ్యాలు పెంచేందుకు ఈ కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జ్యోతి, ఏపిఎం వై కిరణ్, పంచాయతీ కార్యదర్శులు లీలావతి, దయాకర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సదస్సు



తడ,జూలై 2 ప్రభాతవార్త: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఒక నెల ఒక గ్రామం అనే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది రెవెన్యూ అధికారులు ఒక నెలలో ఒక గ్రామంలో నాలుగు వారాలపాటు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారు మొదటివారం రెవెన్యూ సదస్సులో సమస్యలు ఏవైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్తే మిగిలిన మూడు వారాల్లో సమస్య పరిష్కరించే విధంగా ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుంది ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం తడ మండలం వాటంబేడు గ్రామ పరిధిలో తడ తహసిల్దార్ రవికుమార్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు గ్రామ పరిధిలో రెవెన్యూ సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని గ్రామస్తులకు తెలియజేశారు.